
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

11-11-2026 బుధవారం సంపుటి: 32
సంచిక: 281 పేజీలు: 10+4 వెల: 6.50

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

కరీంనగర్

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

అండాల సేకరణ అక్రమదందాపై ఉక్కుపాదం 3

అందెశ్రీ సాహిత్యం భావితరాలకు స్ఫూర్తి 6

ఎదురుపడితే

విష్ చేస్తా..



ప్రధాని మోడీతో పరిచయం అంతే..

దేశంపట్ల మోడీ ఆలోచనలు వేరు, నా దృక్పథం వేరు

నేతల మధ్య గతంలోని స్నేహ బంధాలు ఇప్పుడు లేవు

ఆత్మకథ ' బిలాంగింగ్.. ఎ జర్నీ ఆఫ్ లవ్'లో సోనియా

సంచలనాలు సృష్టిస్తున్న తాజా పుస్తకం

న్యూఢిల్లీ, నవంబరు 10: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో తనకు వ్యక్తిగతంగా పెద్దగా పరిచయం లేదని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వెల్లడించారు. >>2

అందుకే ప్రధాని పదవి వద్దనుకున్నా..

న్యూఢిల్లీ, నవంబరు 10: లోక్‌సభ 2004ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి ఘనవిజయం సాధించడంతో దేశ ప్రధానిగా సోనియా గాంధీ బాధ్యతలు చేపడ తారని అప్పట్లో అంతా భావించారు. అయి తే అనూహ్యంగా ఆమె ఆ పదవిని తిరస్కరించి, మన్మోహన్ సింగ్ పేరు ను ప్రతిపాదించారు. అప్పట్లో దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన ఈ నిర్ణయం వెనుక కార ణాలను సోనియా గాంధీ ఇప్పుడు వెల్లడించారు.తనఆత్మకథ బిలాం గింగ్: ఎ జర్నీ ఆఫ్‌లవ్‌లో 22 ఏళ్ల క్రితం జరిగిన పరిణామా లను వివరించారు. ప్రధాని >>2

మా అత్తకు కోపంవస్తే వణికిపోయేదాన్ని!

ఆత్మకథలో సోనియా

మేనకగాంధీ విడిపోవడం అంతా ఓ రియాల్టీషోగా నడిచింది!

మరిన్ని కథనాలు 5వ పేజీలో

ప్రణబ్ ప్రధాని అవ్వాలనుకొన్నారు..

న్యూఢిల్లీ, నవంబరు 10: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధాన మంత్రి కావాలనే చిరకాల కోరిక ఉండేదని, 2010లో తనతో జరి గిన సంభాషణలో ఆయన ఆ విషయాన్ని పరోక్షంగా వెల్లడిం చారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన జ్ఞాప కాల పుస్తకంలో పేర్కొన్నారు. సోనియా గాంధీ రచించిన 544 పేజీల పుస్తకం బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ లో ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2010లో కాంగ్రెస్ అధ్య క్షురాలిగా ఉన్న సమయంలో ప్రణబ్ ముఖర్జీ తనతో >>2

శాంతి భద్రతల దిశ

డిఎస్పీల చేతుల్లోనే

ఏ హోదాలో ఉన్నా గతాన్ని మరవొద్దు..

ప్రజలతో మమేకమయ్యేది మీరే..

పిఎస్సీలో సంస్కరణలు తెచ్చాం

శిక్షణ పూర్తయిన డిఎస్పీలతో ముఖాముఖిలో సిఎం రేవంత్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు10: మనం వచ్చిన నేపథ్యం మరిచి పోతే మన హోదాకు న్యాయం చేయలేమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న డిఎస్పీలతో ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డీలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో సిఎం,డిజిపి సివి ఆనంద్,భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించారో మీ చేతుల్లో ఉంది, మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతాయి. రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల దిశ ఏ మార్గంలో నడవాలనేది క్షేత్ర స్థాయిలో పనిచేసే డిఎస్పీల చేతు ల్లోనే ఉందన్నారు. మీపై పర్యవేక్షణ చేసే సీనియర్లు ప్రజలతో నేరుగా మమేకమయ్యే అవకాశం ఉండదు, క్షేత్ర స్థాయిలో మీరు తీసుకునే నిర్ణయాలే అత్యంత కీలకం. మీ నడుంచి ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి ఓట్లు వేయమని మేం ఎప్పుడూ అడగం, మీ విధులను నిర్భయంగా,బాధ్యతాయుతంగా నిర్వహించండి అని స్పష్టం >>7



మంగళవారం హైదరాబాద్‌లో తాజా డిఎస్పీలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డిజిపి ఆనంద్ ఇతర ఉన్నతాధికారులు

తెలంగాణ నీటి వాటాపై సుప్రీంలో వాదనలు వినిపించండి: సిఎం 7

బుకర్‌ప్రైజ్ విజేత బ్రిటిష్ రచయిత జాన్‌హారిసన్ 8



షాక్ ఎందుకు? నా తండ్రికి ప్రధాని అయ్యే అర్హతలన్నీ ఉన్నాయి! 5

సోనియా ఆత్మకథ పుస్తకంలో వ్యాఖ్యలపై ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ ఫైర్





రాష్ట్రంలో 86 మోడల్ బస్ స్టేషన్లు

అధిక రద్దీ స్టేషన్ల ఆధునీకరణ

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. బస్ స్టేషన్లలో రద్దీ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు సంస్థ సరికొత్త కార్యాచరణ సిద్ధం చేసిందని ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణీకుల సౌకర్యాలను నిరంతరం మెరుగుపరచడానికి మరియు ప్రజా రవాణా సేవలను మరింత బలోపేతం చేయడానికి ఆర్టీసీ >>2

రైతు భరోసాకు యాసంగిలో మంగళం!

అధిక నీరు వాడే పంటలొద్దన్న వ్యవసాయ శాఖ

ఆరుతడి పంటలకే పరిమితం

పెట్టుబడి సాయంపై సర్కార్ తర్జనభర్జన

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: రాష్ట్రం లో యాసంగి సీజను ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అందిస్తున్న రైతు భరోసాపై సందిగ్ధత ఏర్పడింది. ఎల్ నినో. వర్షాభా పరిస్థితులతో యాసంగి సీజనులో రాష్ట్రంలో తీవ్ర నీటి ఎద్ద డిని ఎదుర్కొనాల్సి వస్తుందని భావిస్తున్న తెలం గాణ సర్కార్ తక్కువ నీటితో సాగయ్యే పంట లను మాత్రమే వేయాలని రైతాంగంలో విస్తృ తంగా ప్రచారం చేస్తోంది. దీంతో వరి సాగుకు అలవాటు పడ్డ రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయడం కత్తిమీద సాములా ఉంటుందని భావిస్తున్నారు.



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదైంది. దీంతో అక్టోబర్‌లోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈసారి వేసవిలో నీటి కొరత తలెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పదే పదే సూచిస్తోంది. నీటి కొరత కారణంగా యాసంగిలోలో వరి వంటి అధికంగా వినియో గించే పంటలను సాగు చేయొద్దని కూడా రైతులకు ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. నీటి వసతి అందుబాటులో ఉన్న చోట ఆరుతడి పంటలకు మాత్రమే పరిమితం కావాలని కోరుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలా వద్దనే మీమాంస రైతులను వెంటాడుతోంది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి యాసంగిలో పంటలు సాగు చేస్తే చివరి వరకూ వాటికి నీరు అందుతుంద లేదా అనేదానిపై రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. నీరు అందకపోయినట్లయితే పెట్టుబడిని నష్టపోవాల్సి వస్తుందనే దిశగా రైతాంగం యాసంగి సాగుపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వీటన్నిటి దృష్ట్యా యాసంగి సీజనుకు రైతు భంధు పథకం కింద పెట్టుబడి సాయం అందించాలా లేక ఈ జనును మినహాయించాలా అనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతు న్నట్లు తెలుస్తోంది. వానాకాలం ఎకరానికి రూ.6 వేలు, యాసంగిలో మరో రూ.6 వేలు చొప్పున ఏడాదికి రూ.12 వేలను రైతు భరోసా >>2



మంగళవారం బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి తుమ్మల

రైతులకు అండగా బ్యాంకులు

రబీకి కొత్త రుణాలు అందించాలి.. ప్రాధాన్యతా రంగాలకు ప్రాముఖ్యత

కరవును జయించేలా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు

బ్యాంకర్ల కమిటీ సమావేశంలో డి.సిఎం భట్టి, మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: ఎల్ నినోతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, ఆర్థిక ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కోరారు. అర్హులైన రైతుల పంట రుణాలను ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం పునర్వ్య వస్థీకరించడం, రీషెడ్యూల్ చేయడంతో పాటు, రబీ సీజన్‌కు అవసరమైన కొత్త రుణాలను సకాలంలో అందిం చాలని సూచించారు.హైదరాబాద్‌లో మంగళవారం జరి గిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఇరువురు మాట్లా డుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల పెట్టుబ డులు, ఆదాయాలు దెబ్బతిన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తక్షణ సహకారం అవసరమని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ ఉపశమన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పిం చాలన్నారు. గత రుణాల రీషెడ్యూలింగ్‌తో పాటు అర్హు లైన రైతులకు కొత్తపంట రుణాలను సకాలంలో అందిం చాలని కోరారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా రుణాలు, మార్కెట్ మద్దతు కల్పించాల్సిన బాధ్య త బ్యాంకులపై ఉందన్నారు. కరవు పరిస్థితుల్లో కనీసం 15 శాతం రైతు కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించేందుకు సహకరించాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు ఇప్పటికే ఉన్న రుణలకు అదనంగా మరో రూ.2 లక్షల అందించడంపై పరిశీలిం చాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపా ధి కోసం బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19 నుండి రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని >>2

వణికిస్తున్న చలి 2

సంగారెడ్డిలో 13 డిగ్రీలకు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రత

వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



మంగళవారం న్యూఢిల్లీలో మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు, పిసిసి చీఫ్ మహేష్ తదితరులు

వెయ్యి గ్రామాలు దాటిన భూ రీసర్వే

భూ యజమానులకు స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు



మంగళవారం అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబరు10, ప్రభాతవార్త: తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ సర్వే పురోగతిపై మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికా రులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న >>2

తొలిదశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక

125 సంవత్సరాలకు జరుగుతున్న భారీ సర్వే: మంత్రి పొంగులేటి

భారత్ సమ్మిట్‌కు రాహుల్!

ఢిల్లీ వెళ్లి ఆహ్వానించిన పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

రేపటి నుంచి మూడు రోజులు భారీ సదస్సులు

హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త: ఢిల్లీ పర్యటనలో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బిజీబిజీగా ఉన్నారు. మంగళవారం ఉదయం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈనెల 12,13,14వ తేదీల్లో హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్' సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రావాల్సిందిగా రాహుల్‌ను మహేశ్ ఆహ్వానించారు. మూడు రోజుల పాటు జరుగనున్న సమావేశాల్లో ఏదో ఒకరోజు రాహుల్ గాంధీ హాజరుకానున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం జరిగిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలోనూ ఏఐసీసీ అగ్రనేత పాల్గొన్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులు వరుసగా కార్యక్రమం జరుగనుంది. ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా 'భారత్ సమ్మిట్'ను నిర్వహించనున్నాయి.ఆంతర్జాతీయ సదస్సుకు >>2



యుపి ఘజియాబాద్‌లో గాలి నాణ్యత క్షీ ణించడంతో ఢిల్లీ సరిహద్దు వద్ద మాస్కులతో విధులు నిర్వహిస్తున్న సివిల్ డిఫెన్స్ ఆధికారులు

ఎదురుపడితే విష్ చేస్తా..

>> అధికారిక కార్యక్రమాల్లో ఎదురుపడినప్పుడు నమస్కారం చేసుకోవడం మినహా ఇద్దరి మధ్య ఎలాంటి సంభాషణ ఉండదని తెలిపారు. మోడీ తనను కలిసినప్పుడు కళ్లలోకి చూడకుండా మరోవైపు చూస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ విషయాలను తన తాజా పుస్తకం బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్‌లో వివరించారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి పన్నెండేళ్లకు పైగా గడిచిందని, ప్రస్తుతం ఆయన మూడోసారి ఆ పదవిలో కొనసాగుతున్నారని సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయనతో తనకు ఇప్పటివరకు నిజమైన వ్యక్తిగత పరిచయం ఏర్పడలేదని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత స్పీకర్ ఛాంబర్‌లో వివిధ పార్టీల నేతలు సమావేశమవుతుంటారని ఆమె వివరించారు. అలాంటి సందర్భాల్లో మోడీఎదురుపడితే ఇద్దరం మర్యాదపూర్వకంగా నమస్కారం చేసుకుంటామని చెప్పారు. గతంలో భిన్న రాజకీయ పార్టీలకు చెందిన నేతల మధ్య కూడా స్నేహపూర్వక సంబంధాలు ఉండేవని, ఇప్పటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఆ అధికారిక పలకరింపులు మినహా మోడీతో ఎప్పుడూ పెద్దగా మాట్లాడలేదని సోనియా తెలిపారు. అయితే పుట్టినరోజులు, నూతన సంవత్సర శుభాకాంక్షలు మాత్రం పరస్పరం తెలియజేసుకున్నామని చెప్పారు. దేశం పట్ల మోదీ ఆలోచనలు, తన భావాలు పూర్తిగా భిన్నమైన రాజకీయ దృక్పథాలకు చెందినవని పేర్కొన్నారు. తాను ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత తిరిగి వచ్చిన సందర్భాల్లో మోడీ ఆరోగ్యం గురించి అడిగేవారని సోనియా వెల్లడించారు. బాగున్నారా? అని ఆయన ప్రశ్నిస్తే, బాగున్నాను ధన్యవాదాలు అని సమాధానం చెప్పేదానినని పుస్తకంలో రాశారు. సోనియా గాంధీ రాసిన ఈ పుస్తకం నేటి నుంచి పాఠకులకు అందుబాటులోకి వచ్చింది.

అందుకే ప్రధాని పదవి
వద్దనుకున్నా..

>> పదవిపై తనకు ఆసక్తి లేకపోవడానికి గల కారణాలతో పాటు, మన్మోహన్ సింగ్‌ను ఆ బాధ్యతలకు ఎంపిక చేయడం వెనుక ఉన్న ఆలోచనలను పంచుకున్నారు. 2004 ఎన్నికలకు కొన్ని నెలల ముందే తాను ప్రధాని పదవి చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు సోనియా తెలిపారు. ఈ విషయాన్ని రాహుల్, ప్రియాంకతో చర్చించినప్పుడు కూడా స్పష్టంగా చెప్పానన్నారు. పార్టీ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రధాని అవుతారా? అని పిల్లలు అడిగినప్పుడు, కచ్చితంగా కాదు అని సమాధానమిచ్చినట్లు గుర్తుచేసుకున్నారు. అప్పటికే తన కుటుంబం ఎన్నో విషాదాలను ఎదుర్కొందని సోనియా పేర్కొన్నారు. నానమ్మ ఇందిరాగాంధీ హత్య, తండ్రి రాజీవ్ గాంధీ హత్య ఘటనలను చిన్నతనంలోనే చూసిన రాహుల్, ప్రియాంక, ప్రధాని పదవి చేపడితే తనకు కూడా ప్రాణహాని ఉంటుందని ఆందోళన చెందేవారని వివరించారు. అయితే ఎన్నికల సమయంలోనే తన నిర్ణయాన్ని బహిరంగంగా ప్రకటిస్తే పార్టీలో నాయకత్వంపై చర్చలు, విభేదాలు మొదలవుతాయని భావించి మౌనంగా ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల్లో యూపీఏ విజయం సాధించిన తర్వాత కూటమి నేతలు సోనియా నివాసానికి వచ్చి ఆమెనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలని కోరినట్లు ఆత్మకథలో వివరించారు. వారి ఒత్తిడి మధ్య ఒక దశలో అస్పష్టంగా అంగీకరించినట్లు తెలిపారు. కిటికీ నుంచి ఈ పరిణామాలను గమనించిన ప్రియాంక వెంటనే రాహుల్‌కు విషయం చెప్పారని గుర్తుచేసుకున్నారు. మరోవైపు తన ఇటలీ మూలాలను బీజేపీ, దాని మిత్రపక్షాలు రాజకీయంగా ఉపయోగించుకుంటాయని ఆమె భావించారు. తాను ప్రధాని అయితే విదేశీ మూలాల అంశాన్ని తెరపైకి తెచ్చి దేశంలో రాజకీయ ఉద్రిక్తతలు సృష్టించే అవకాశం ఉందని ఆందోళన చెందారు. తాను ప్రేమించే దేశానికి అలాంటి పరిస్థితి రావడం ఇష్టం లేదని పేర్కొన్నారు. ఆ రాత్రంతా తీవ్రంగా ఆలోచించినట్లు సోనియా తెలిపారు. భర్త రాజీవ్ పడుకునే వైపు మంచంపై పడుకుని తన నిర్ణయంపై మథనపడ్డానని చెప్పారు. చివరకు తన అంతరాత్మ చెప్పిన మాటను అనుసరించి ప్రధాని పదవిని చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. మరుసటి రోజు ఉదయం రాహుల్ గదికి వెళ్లి తన నిర్ణయాన్ని చెప్పగా, ఆయన తనను హత్తుకుని ఇది సరైన నిర్ణయమని అభినందించినట్లు వివరించారు. తన నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రకటించినప్పుడు కూడా తీవ్ర పరిణామాలు ఎదురయ్యాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ఆమె ప్రధాని కావాలని కోరుతూ ఎంపీలు పోడియం చుట్టూ చేరి నినాదాలు చేశారు. దీంతో ఒక దశలో ఊపిరాడక స్పృహ తప్పినంత పనైందని తెలిపారు. అధికారం తన లక్ష్యం కాదని, దేశ లౌకిక పునాదులను కాపాడటమే తన ప్రధాన ఉద్దేశమని పార్టీ నేతలకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. చివరకు తన నిర్ణయాన్ని అంగీకరించేలా వారిని ఒప్పించినట్లు వివరించారు.

తాను ప్రధాని పదవిని తిరస్కరించిన తర్వాత ఆ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే ప్రశ్న ఎదురైందని సోనియా తెలిపారు. కాంగ్రెస్‌లో పలువురు సీనియర్ నేతలు ఆ పదవికి అర్హులైనప్పటికీ మన్మోహన్ సింగ్ తనకు సరైన వ్యక్తిగా కనిపించారని వివరించారు. మన్మోహన్ సింగ్‌కు పాలనాపరమైన అంశాలపై లోతైన అవగాహన ఉందని, ఆయన వ్యక్తిత్వం, నిజాయతీపై తనకు నమ్మకం ఉందని పేర్కొన్నారు. గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఆయన దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అంతేకాకుండా మన్మోహన్ సింగ్ కాంగ్రెస్‌లోని ఏ ప్రత్యేక వర్గానికీ అనుబంధంగా లేరని సోనియా తెలిపారు. యూపీఏ ప్రభుత్వానికి వామపక్ష పార్టీల మద్దతు ఉన్న నేపథ్యంలో ఆర్థిక విధానాల కొనసాగింపుపై ఎలాంటి సందేహాలు రాకుండా ఉండేందుకు మన్మోహన్ సరైన వ్యక్తిగా భావించినట్లు చెప్పారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి, పంజాబ్‌లోని ఓ మారుమూల గ్రామం నుంచి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణాన్ని కూడా సోనియా ప్రస్తావించారు. పండితుడిగా, ఆర్థికవేత్తగా ఆయన సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత నిజాయతీ, దయాగుణం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఆయన చేతుల్లో దేశం సురక్షితంగా ఉంటుందని విశ్వసించినట్లు పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ పేరును ప్రతిపాదించినప్పుడు కాంగ్రెస్ సీనియర్ నేతల నుంచి పెద్దగా వ్యతిరేకత రాలేదని సోనియా వెల్లడించారు. స్వయంగా మన్మోహన్ సింగ్‌ను ఈ బాధ్యతలు చేపట్టాలని కోరినప్పుడు ఆయన తొలుత అంగీకరించలేదని గుర్తుచేసుకున్నారు.

రైతులకు అండగా బ్యాంకులు

>> ప్రారంభించనుందని, దాన్ని ముందుకు తీసుకెళ్లేలా కమిటీ చొరవ చూపాలని తెలిపారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు, విద్యుత్ వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో పాటు రైతుల రుణ చెల్లింపు సామర్థంపైనా ప్రభావం పడుతోందన్నారు.

ఈ సంక్షోభాన్ని అన్ని రంగాలూ సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు కూడా ఆశించిన స్థాయిలో రీచార్జి కాకపోవడంతో సుమారు 10 నుంచి 15 లక్షల బోరుబావుల్లో నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ప్రభావం ఖరీఫ్‌తో పాటు రబీ పంటలపైనా పడే అవకాశం ఉన్నందున రైతులను ఆదుకునేందుకు బ్యాంకులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సుమారు రూ.21 వేల కోట్ల పంట రుణమాఫీని అమలు చేసిందని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించిందని వివరించారు.

వ్యవసాయ యాంత్రీకరణ, సాగునీరు, విద్యుత్, సబ్సిడీ తదితర రంగాలతో కలిపి వ్యవసాయంపై రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం తన వంతు బాధ్యతగా రైతులకు అండగా నిలుస్తోందని, బ్యాంకర్లు కూడా అదే స్ఫూర్తితో సహకరించాలని కోరారు. రబీ సీజన్‌కు బ్యాంకులు నిర్దేశించుకున్న రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు.

2026 సెప్టెంబర్ వరకు రూ.96,943 కోట్ల రుణ పంపిణీ లక్ష్యంలో 53 శాతం మాత్రమే సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మాన్‌సూన్ ఫార్మింగ్ రుణాల పంపిణీ కూడా లక్ష్యంలో 17 శాతానికే పరిమితమైందని, ఈ పరిస్థితిని అధిగమించి రుణాల మంజూరులో వేగం పెంచాలన్నారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



ప్రణబ్ ప్రధాని అవ్వాలనుకొన్నారు..

>> మాట్లాడిన సందర్భాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. అప్పట్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో సమన్వయం కోసం ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌తో వారానికి ఒకసారి కీలక నేతల సమావేశం జరిగేదని సోనియా తెలిపారు. ఈ సమావేశంలో ప్రణబ్ ముఖర్జీ, అర్జున్ సింగ్, ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్ తదితరులు పాల్గొనేవారని వివరించారు. పార్లమెంటులో చర్చించాల్సిన అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు వ్యూహాత్మక బృందం సమావేశాలు కూడా క్రమం తప్పకుండా జరిగేవని పేర్కొన్నారు. ఆ సమావేశాల అనంతరం ప్రణబ్ ముఖర్జీ తనతో కొద్దిసేపు మాట్లాడేవారని చెప్పారు. 2010లో ఆర్థిక మంత్రి పి. చిదంబరంతో ప్రణబ్ ముఖర్జీకి తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయని, ఒకసారి తన అసంతృప్తిని వ్యక్తం చేసిన అనంతరం ఆయన చేసిన వ్యాఖ్య తనను ఆశ్చర్యానికి గురి చేసిందని సోనియా తెలిపారు. బహుశా ఇప్పుడు నాయకత్వంలో మార్పు రావాల్సిన సమయం వచ్చిందేమో అని ప్రణబ్ ముఖర్జీ అన్నారని, ఆ వ్యాఖ్యను తాను ప్రధాని కావాలన్న ఆయన చిరకాల ఆకాంక్షకు సంకేతంగా అర్థం చేసుకున్నానని సోనియా పేర్కొన్నారు. ఆ సమయంలో తాను సున్నితంగా సంభాషణను మరో అంశం వైపు మళ్లించానని, ప్రణబ్ కొంత నిరాశకు గురై ఉండవచ్చని, అయినప్పటికీ తనపై ఎలాంటి అసంతృప్తిని వ్యక్తం చేయలేదని ఆమె వెల్లడించారు. 2012లో యూపీఏ తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రణబ్ ముఖర్జీని నామినేట్ చేసిందని, అనంతరం ఆయన ఎన్నికల్లో విజయం సాధించి భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారని సోనియా గుర్తుచేశారు. ప్రణబ్ ముఖర్జీ గొప్ప పాండిత్యం, రాజకీయ పరిజ్ఞానం కలిగిన నాయకుడని, ఆయనతో తరచూ మాట్లాడేందుకు వెళ్లేదానినని ఆమె తన పుస్తకంలో రాశారు. సోనియా వ్యాఖ్యలపై ప్రణబ్ ముఖర్జీ కుమార్తె స్పందిస్తూ, ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముందని ప్రశ్నించారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ ప్రభుత్వ పాలనలో తాను తెరవెనుక నుంచి అధికారాన్ని నియంత్రించానన్న ఆరోపణలను కూడా సోనియా గాంధీ తన పుస్తకంలో ఖండించారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అధికారాలను తాను ఎప్పుడూ గౌరవించానని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొన్ని సూచనలు చేయడం, అభిప్రాయ భేదాలు వ్యక్తం చేయడం తన హక్కు అయినప్పటికీ, ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయాలను గౌరవించడం తన బాధ్యతగా భావించానని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఎలాంటి అపార్థాలకు తావివ్వకూడదని, తద్వారా ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని బలహీనపరిచే అవకాశం కల్పించకూడదని తాను ఎప్పుడూ జాగ్రత్తపడ్డానని తెలిపారు. ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం, నా ఆధ్వర్యంలో పార్టీ నడిచేవి. మా ఇద్దరి మధ్య బాధ్యతల విభజన స్పష్టంగా ఉండేది. ఈ వ్యవస్థ సజావుగా పనిచేసిందని సోనియా తన పుస్తకంలో వివరించారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో తనపై వచ్చిన పలు మీడియా కథనాలను కూడా ఆమె ప్రస్తావించారు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించేదానినని, ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకునేదానినని, కీలక నియామకాల్లో ప్రభావం చూపించేదానినని తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ మాజీ సహాయకుడు రచించిన పుస్తకంలోనూ ఈ ఆరోపణలను మరోసారి ప్రస్తావించారని సోనియా తెలిపారు. ప్రభుత్వానికి సంబంధం లేని వ్యక్తిగా అధికారిక ఫైళ్లను పరిశీలించడం నిబంధనలకు విరుద్ధమని, తాను ఎప్పుడూ నిబంధనలను పాటించేందుకు ప్రాధాన్యత ఇచ్చానని చెప్పారు. తనపై వచ్చిన ఆరోపణల్లో అధికారిక ఫైళ్లను పరిశీలించానన్న ఆరోపణే తనను అత్యంత బాధించిందని వెల్లడించారు. తనకు ప్రధానమంత్రి కార్యాలయంలోని అధికారిక ఫైళ్లను ఎప్పుడూ చూపించలేదని పీఎంఓ కూడా స్పష్టమైన ప్రకటన విడుదల చేసిందని సోనియా గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ కుమార్తె ఉపిందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలను కూడా ఆమె ప్రస్తావించారు. తన తండ్రి మాజీ సహాయకుడు రచించిన పుస్తకం నమ్మకద్రోహంతో కూడిన చర్య అని, విశ్వాసాన్ని దెబ్బతీసే అనైతిక ప్రయత్నమని ఉపిందర్ అభివర్ణించినట్లు తెలిపారు. తన తండ్రి, సోనియా గాంధీ మధ్య సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవంపై ఆధారపడి ఉండేవని ఉపిందర్ స్పష్టం చేసినట్లు సోనియా పేర్కొన్నారు. అయినప్పటికీ, సోనియా తెరవెనుక నుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారంటూ ప్రతిపక్షాలు, మీడియా తరచూ ఆరోపణలు చేస్తూనే ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోనియా గాంధీ రచించిన 544 పేజీల ఈ జ్ఞాపకాల పుస్తకం మంగళవారం మార్కెట్లోకి వచ్చింది. ఈ పుస్తకం ప్రారంభంలో ఋగ్వేదంలోని ఐక్యతను చాటిచెప్పే సూక్తిని పొందుపరిచారు. కలిసి నడవండి, కలిసి మాట్లాడండి, మీ ఆలోచనలు ఏకీభవించాలి. మీ లక్ష్యం ఒక్కటిగా ఉండాలి, మీహృదయాలు సమన్వయంతో ఉండాలి, మీ ఆలోచనలు ఏకతాటిపై నిలవాలి. ఐకమత్యంతో, సంపూర్ణతతో జీవించండనే భావాన్ని ఆ సూక్తి తెలియజేస్తుంది.

వణికిస్తున్న చలి

సంగారెడ్డిలో 13 డిగ్రీలకు పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రత

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: తెలంగాణలో గత రెండు మూడు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. పగటిపూట ఎండ తీవ్రత ఉన్నప్పటికీ, రాత్రి ఏడు దాటిన వెంటనే ఉష్ణోగ్రతలు కాస్త క్షీణిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిల కంటే తక్కువగా నమోదవుతున్నాయి. శివారు ప్రాంతాలు, ఐటీ కారిడార్ వంటి ప్రాంతాల్లో చలి గాలులు ఎక్కువగా ప్రభావం చూపిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది, ఇది సాధారణ ఉష్ణోగ్రత కంటే 5.3 డిగ్రీలు తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో కూడా చలి తీవ్రత గణనీయంగా ఉంది. అక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రత 15.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది సాధారణం కంటే 3.6 డిగ్రీలు తక్కువగా ఉంది. హైదరాబాద్ కేంద్రంగా 19.6 డిగ్రీలు, హకీంపేటలో 19.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లాలోని దుండిగల్‌లో 18 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అయితే, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పరిసరాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువగా 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నేటి నుంచి వరుసగా మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాత్రి వేళలతో పాటు తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉండవచ్చని తెలిపింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయే అవకాశముందని హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రాత్రి, తెల్లవారుజామున అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండటం, వెచ్చని దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని పేర్కొంది. రాబోయే 3రోజులు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.



'భాయ్ దూజ్' సందర్భంగా సోదరుల దీర్ఘాయువును కోరుతూ మంగళవారం వారణాసిలో 'గోద్నా పూజ' నిర్వహిస్తున్న మహిళలు

వెయ్యి గ్రామాలు దాటిన భూ రీసర్వే

>> సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో రీసర్వే మైలురాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. 125 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యత, పారదర్శకత, కచ్చితత్వం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి అధికారులకు సూచించారు. గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించడానికి ముందుగా ఆ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి, రికార్డుల్లో ఉన్న వివరాలు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను ప్రారంభించాలి. సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలి. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, ఏవైనా అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే తెలియజేసేందుకు వారికి తగిన అవకాశం కల్పించాలి, భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సర్వే అనంతరం భూ యజమానులకు ఎలాంటి నోటీసులు జారీ చేస్తారు? అభ్యంతరాలను ఎలా నమోదు చేయాలి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అనే అంశాలపై గ్రామస్థాయిలో రైతులకు, భూ యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. సర్వే ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి. సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదు. ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలి. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలి. భూ యజమానులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి. రీసర్వే ప్రారంభ దశలోనే ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు, లోపాలు గుర్తించినట్లయితే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. కాగా భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వారీగా పురోగతిని సమీక్షి చి, అధికారులకు తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమ్మిట్‌కు రాహుల్

>> దాదాపు 100 దేశాలకు చెందిన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించారు. దాదాపు 450 మంది ప్రముఖ ప్రతినిధులతో పాటు కేంద్రమంత్రులు, ఎంపీలు, పలువురు ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉంది. అంతర్జాతీయ సంబంధాలు, దేశాల మధ్య సహకారం, ఆర్థిక అభివృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై భారత్ సమ్మిట్‌లో చర్చించనున్నారు.ఇదిలా ఉండగా, కాంగ్రెస్‌లో వరుసగా జరుగుతున్న పంచాయితీలపై పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంగళవారం ఉదయం ఢిల్లీకి వెళ్లిన మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి మోఖికంగా



మంగళవారం విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సింగరేణి సిఎండి డాక్టర్ ప్రకాష్

జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు

సింగరేణి సిఎండి డాక్టర్ ప్రకాష్

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: ఎల్ నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రాష్ట్రంలోని జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. హైదరాబాద్‌లో మంగళవారం జెన్కో సిఎండి డాక్టర్ హరీష్‌తో కలసి నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో ఒడిశాలోని నైనీ నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సూచించారు. గత మూడు నాలుగేళ్లతో పోల్చి చూస్తే ఈ ఏడాది తెలంగాణ జెన్కోకు ఎక్కువ బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరిగితే సింగరేణి తన సామర్థ్యం మేరకు మరింత బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని లక్ష్యంగా పెట్టుకున్నామని, మరోపక్క ప్రస్తుతం 3 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో యాదాద్రికి బొగ్గు రవాణాను పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాగా ఒడిశాలో స్థానికంగా రవాణా సమస్యల వల్ల బొగ్గు రవాణాలో కొంత జాప్యం జరుగుతోందని, ఈ నెలాకరు నుంచి 16 వేల టన్నులను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జెన్కో సీఎండీ డాక్టర్ హరీష్ వివరించారు. గని నుంచి సమీప రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో జరుగుతున్న బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జెన్ కోలతో సహా స్థానికంగా ఉండే పలు ప్రైవేట్ సంస్థలు కూడా నైనీ బొగ్గు కోసం విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా నైనీ జీఎం ప్రస్తావించారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లతో పాటు, రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

కామన్వెల్త్‌లో విశాల్‌కు కాంస్యం

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్స్-2026లో జూనియర్ పురుషుల వ్యక్తిగత కుమిటే 61 కేజీల విభాగంలో తెలంగాణకు చెందిన అమరాది విశాల్‌రెడ్డి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ పోటీలు స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన ఈ పోటీలో ప్రపంచంలోని అత్యుత్తమ కరాటే క్రీడాకారులతో తలపడ్డాడు. విశాల్ సాంకేతిక నైపుణ్యం, పట్టుదల, క్రమశిక్షణ, మానసిక బలాన్ని ప్రదర్శించి ఈ పోటీలో కాంస్య పతక విజేతగా నిలిచాడు. ఈ విజయం తెలంగాణకు గర్వకారణంగా నిలిచింది. విశాల్ విజయాన్ని తీర్చిదిద్దడంలో నిపుణులైన మార్గదర్శకత్వం, నిరంతర మెంటరింగ్, కృషితో అతని కోచ్ నరేష్ కీలక పాత్ర పోషించాడు.



భారత్ 100వ గ్రాండ్ మాస్టర్‌గా అనుజ్ శ్రీవత్రి

సినాకబాన్, నవంబరు 10: భారత చదరంగం చారిత్రక మైలురాయిని అందుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల అనుజ్ శ్రీవత్రి దేశ 100వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించాడు. ఫిలిప్పీన్స్‌లో ముగిసిన 7వ ఏషియన్ ప్లస్ ఇండివిడ్యువల్ ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి ఆయన ఈ ఘనత సాధించాడు. ఈ విజయంతో మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన తొలి ఆటగాడిగా కూడా ఆయన రికార్డు సృష్టించాడు. ఈ టోర్నమెంట్‌లో విజేతకు నేరుగా గ్రాండ్‌మాస్టర్ టైటిల్ ఇచ్చేందుకు ఫిడే (అంతర్జాతీయ చెస్ సమాఖ్య) ప్రత్యేకంగా అనుమతి ఇచ్చింది. దీంతో మూడు జీఎం నార్మ్‌లు, 2500 ఎలో రేటింగ్ వంటి సాధారణ నిబంధనల అవసరం లేకుండానే అనుజ్ ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. టోర్నీలో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన అనుజ్ తొలి గేమ్‌లో ఓడిపోయినా అద్భుతంగా పుంజుకున్నాడు. మొత్తం 9 గేమ్‌లలో 7 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. 1988లో విశ్వనాథన్ ఆనంద్ దేశ తొలి గ్రాండ్‌మాస్టర్‌గా నిలవగా, 100వ గ్రాండ్‌మాస్టర్ మైలురాయిని చేరడానికి సుమారు 38 ఏళ్ల పట్టింది. ముఖ్యంగా 2010 తర్వాత దేశంలో గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కట్నీకి చెందిన అనుజ్ 2019 నుంచి ఇంటర్నేషనల్ మాస్టర్‌గా ఉన్నాడు. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసిన అనుజ్ చెస్‌పై దృష్టి పెట్టేందుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాన్ని కూడా విడిచిపెట్టాడు. అనుజ్ చారిత్రక విజయం పట్ల అఖిల భారత చెస్ సమాఖ్య అధ్యక్షుడు నితిన్ నారంగ్, దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ అభినందనలు తెలిపారు. దీపావళి పండుగ వేళ ఈ ఘనత సాధించడంపై ఆనంద్ స్పందిస్తూ ఇది క్రాకర్ లాంటి 100 అని వ్యాఖ్యానించారు.

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అనుమతుల వివరాలివ్వండి

ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు కెఆర్ఎంబి లేఖ

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి వాస్తవ అనుమతుల వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబీ) తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, నీటి వినియోగం, కాల్వల సామర్థం, ఆయకట్టు వివరాలతో పాటు ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనపు నీటి అవసరాల వివరాలు ఇవ్వాలని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు మొదట ఆమోదించిన ప్రాజెక్టు వివరాలనే ప్రామాణికంగా తీసుకొని తదుపరి మార్పులను పరిశీలించనున్నట్లు పేర్కొంది. శ్రీశైలం ప్రాజెక్టులో 11, నాగార్జునసాగర్లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు 2021 నాటి నోటిఫికేషన్లో కేంద్రం ప్రస్తావించిందని గుర్తు చేసింది. ఈ మార్పులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల క్లియరెన్స్ వివరాలను కూడా సమర్పించాలని నవంబర్ 6న జారీ చేసిన లేఖలో రెండు రాష్ట్రాలను కోరింది.

అండాల సేకరణ అక్రమ దందాపై సర్కారు ఉక్కుపాదం

రాష్ట్రవ్యాప్తంగా 27 ఎఆర్టీ కేంద్రాల్లో తనిఖీలు

7 ఆస్పత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు, షోకాజ్ నోటీసులు జారీ

31 మంది మహిళల గుర్తింపు, వైద్యులు, ఐవిఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ

హైదరాబాద్, నవంబరు 10,ప్రభాతవార్త: అండాల సేకరణ ముసుగులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఐవీఎఫ్ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు చేపట్టింది.రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో వైద్య అధికారులు తనిఖీలు పూర్తి చేశారు. ఈ తనిఖీల్లో ఏడు ఆసుపత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.మిగిలిన కేంద్రాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులు, జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్ట నున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి పలువురు మహిళలను గుర్తించగా, వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ కొనసా గుతోంది.

ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు ఈ నెల 6న వైద్య అధికారులు న్యూ ఢిల్లీలోని నేషనల్ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సం దర్శించారు. తెలంగాణలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలను కోరారు. రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని అందజేస్తామని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) అధికారులు హామీ ఇచ్చారు.అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం-2021, దాని నిబంధనలకు విరుద్ధంగా మహిళల నుంచి అండాలను సేకరించడం శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొంద డంతోపాటు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు లోనై అక్రమ వైద్య విధానాలకు మహిళలు బలికావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

'అగ్రి' విసిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

బాధితురాలికి న్యాయం చేయాలి:

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్

హైదరాబాద్ (అత్తాపూర్), నవంబరు 10, ప్రభాతవార్త: మహిళ ప్రొఫెసర్‌పై విసి వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలపై నిరసనలు రోజురోజుకు ఉధృతం అవుతున్నాయి. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళా ప్రొఫెసర్‌పై వేధింపుల ఘటనకు నిరసనగా రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయంలో టీఏఎస్ఏ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మహిళా ప్రొఫెసర్‌ను వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్‌ఛాన్సలర్ అల్దాస్ జాన య్యపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్లు, విద్యార్థులు, విశ్వవిద్యాలయ సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ విసి గో బ్యాక్.. గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైంది : మాజీ మంత్రులు

వ్యవసాయ వర్సిటీలో నిర్వహిస్తున్న నిరసనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే గొంగిడి సునీతా పాల్గొని మద్దతు తెలిపారు. బాధిత ప్రొఫెసర్‌తో మాట్లాడి భరోసా కల్పించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ తరపున అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. విద్యాబుద్ధులు నేర్పే అధ్యాపకురాలికే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వర్సిటీ విసిపై ఫిర్యా దు చేసి 17 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణమన్నారు. వర్సిటీలో నిర్వహిస్తున్న నిరసనలో బాధిత మహిళా ప్రొఫెసర్‌కు మద్దతు తెలిపేందుకు వచ్చిన బిఆర్ఎస్, ఎబివిపి నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వర్సిటీలోకి నిరసనకారులను రాకుండా ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అరెస్టులు చేశారు.



నిరసనలో పాల్గొన్న మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

విసి జానయ్యపై ఆరోపణలు అవాస్తవం

విసి అల్దాస్ జానయ్యపై చేస్తున్న ఆరోపణలు అవాస్తమని కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని నాన్ టీచింగ్ స్టాఫ్ సభ్యులు మండిపడ్డారు. బదలీ చేస్తే బద్నం చేస్తారంటూ నాన్‌టిచింగ్ స్టాఫ్ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విసి జానయ్యకు న్యాయం జరగాలని ఆయనపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అన్నారు.

కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌కు ఇడి షాక్

రూ.18.33 కోట్ల ఆస్తులు అటాచ్

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ రైస్ మిల్స్‌గా పేరొందిన కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) షాక్ ఇచ్చింది. ఈ రైస్ మిల్స్‌కు సంబంధించిన రూ.18.33 కోట్ల ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. మంగళవారం ఉదయం తెలంగాణతో పాటు ఎపిలోని కృష్ణా, గుంటూరులో గల ఈ రైస్ మిల్స్‌కు సంబంధించిన కీలక ఆస్తులను ఈడీ జప్తు చేసింది. బ్యాంకు రుణాల మోసం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. ఈ రైస్ మిల్స్ నిర్వాహకులు కల్లం పేరిరెడ్డి ఆయన కుటుంబ సభ్యులు 2010...2013 మధ్య గుంటూరులోని అగ్రహారం ఎస్‌బీహెచ్ నుంచి రూ.24. 57 కోట్ల రుణం తీసుకుని దానిని చెల్లించకుండా ఇతర అవసరాలకు మళ్లించారు. దీనిపై బ్యాంకు అధికారులు ఆరా తీయగా నకిలీ, ఫోర్జరీ ఆస్తి పత్రాలను తనఖా పెట్టి కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ పేరిట రుణం పొందినట్లు తేలింది. దీనిపై బ్యాంకు అధికారులు సిబిఐకి ఫిర్యాదు చేయగా వారు లోతుగా విచారించగా కల్లం పేరిరెడ్డి అతని కుటుంబ సభ్యులు కల్లం మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీ రామబ్రహ్మ మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీ వి నాయక ట్రేడర్స్ పేరుతో రుణాలు తీసుకున్నట్లు తేలింది. దీని తరువాత మూడు సంస్థల క్యాష్ క్రెడిట్ ఖాతాల నుంచి రూ.23.81 కోట్ల నగ దును ఉపసంహరించుకోవడంతో పాటు కార్మికులు, అకౌంటెంట్లు, కల్లం పేరిరెడ్డి పేర్లతో నగదు విత్ డ్రా చేసినట్లు గుర్తించారు.

రుణాల సొమ్ముతో పలు స్థిరాస్తులను కొనుగోళ్లు చేసినట్లు సిబిఐ తేల్చింది. దీంతో మనీలాండరింగ్ కోణంలో ఇడి రంగంలో దిగి విచారణ చేబట్టి కల్లం పేరిరెడ్డి ఆయన కుటుంబ సభ్యుల అక్రమాలను నిగ్గు తేల్చారు.

ఈ కేసులో బంధువులు, అనుచరుల పేర్లకు ఎలాంటి నగదు చెల్లించకుండానే మొత్తం ఆస్తులను కల్లం పేరిరెడ్డి తన పేరిట బదిలీ చేసుకునట్లు ఈడీ అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలో కల్లం కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ కు సంబంధించి మొత్తం 50 స్థిరాస్తులను జప్తు చేశారు.

వీటి విలువ రూ.18.33 కోట్లు కాగా ఇందులో ఐదు ఫ్లాట్ల విలువ రూ.1.45 కోట్లు, మిగతాది స్థిర, చరాస్తులు వున్నాయి. చెన్నై ఈడీ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఈ కంపెనీకి ఎపిలో పలుచోట్ల రైస్‌మిల్స్ ఉండగా హైదరబాద్‌లోని కూకట్‌పల్లిలో కార్పొరేట్ కార్యాలయం వుంది.

క్యూర్ పరిధిలో క్లౌడ్ కిచెన్‌లపై టిజి సేఫ్ దాడులు

ఆహార పదార్థాల్లో వాడేందుకు ఫుడ్ కలర్స్, బొంబాయి రవ్వలో పురుగులు, బొద్దింకలు

గడువు ముగిసిన సగ్గు బియ్యం, 60 కిలోల కేక్ బేస్ జప్తు

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ఏ ర్పాటైన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజిసేఫ్) మంగళవారం క్యూర్ పరిధిలోని క్లౌడ్ కిచెన్‌లపై మెరుపు దాడులు నిర్వ హించింది. ఈ సందర్భగా అపరి శుభ్రంగా వున్న వంటశాలలు, ఆహార ప దార్థాల తయారీలో వా డేందుకు ఫుడ్ కలర్స్, గ డువు ముగిసిన సగ్గు బియ్యం, బొంబాయి రవ్వలో బొద్దింకలు, కీట కాలు వుండడం కను గొన్నారు. దీంతోపాటు కూర గాయలు కట్ చేసేందుకు ప్లాస్టిక్ బోర్డులు వుండగా వాటిని జప్తు చేశారు. ఇదే సమయంలో గడువు ముగిసిన 60 కిలోల కేక్ బేస్‌లు వుండగా వాటిని కూడా జప్తు చేశా రు. చాలాచోట్ల గడువు ముగిసిన ఆహార పదార్థాలు, రికార్డులు సరిగ్గా లేక పోవడం, వంటలు చేసేవారు పరిశుభ్రంగా వుండక పోవడం, తిను బండారాలు తయారు చేసేచోట బొద్దింకలు, ఈగలు ముసురు తుండడం అధికా రులు గుర్తించారు. ఆహార పదార్థాల తయారీపై నిర్లక్ష్యం వహించిన కిచెన్ నిర్వా హకులపై టీజీ సేఫ్ బృందాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మొత్తం 25 టీజీ సేఫ్ అధికారుల బృందాలు దాడులు నిర్వహించా యి. దాడుల సందర్భంగా కల్తీ ఆహారం కలిగిన కిచెన్‌ల నుంచి శాంపుల్స్‌ను సేకరించి వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. దాడుల సం మరికొన్ని అక్రమాలు వెలుగు చూడడంతో ఐదింటిని మూసివేయగా నాలుగింటికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆరింటికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. కల్తీ ఆహార వస్తువుల తయారీ విషయంలో కఠినంగా వుంటామని టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి హెచ్చరించారు.

ఉస్మానియా ఉద్యోగుల ధర్నాకు పార్టీల మద్దతు

ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవే..

సిఎం దృష్టికి తీసుకెళ్తా: ఎం.పి. ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న కవిత, చిత్రంలో ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

హైదరాబాద్ (తార్నాక), నవంబరు 10, ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ కొనసాగుతున్న ఆందోళనకు పలువురు రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. ఒయులో నాన్ టిచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమం ఉధృతమైంది. తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాన్ టిచింగ్ స్టాఫ్ సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు పలు వురు నేతలు మద్దతు తెలి పారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ పార్టీ వ్యవస్థాపక అధ్య క్షుడు ఆర్. కృష్ణయ్య, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేం దర్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధర్నాలో పాల్గొని ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని, ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు పరిష్కరించగలిగే న్యాయమైన సమస్యలని ఎంపి. ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు.

ఉద్యోగస్థులు కుటుంబాన్నెలా పోషించుకుంటారు?: ఎంపి ఈటల

తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న ఉద్యోగుల ఇబ్బందులను అర్థం చేసుకోవాలని సూచించారు. రూ.15 వేల వేతనంతో ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలు, గత పరిణామాలతో సమగ్ర నివేదికను జేఏసీ నాయకులు అందించాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నాన్ టిచింగ్ సిబ్బంది ఏడాదిన్నరగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోరా? అని కల్వ కుంట్ల కవిత కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఉద్యమాల ఖిల్లాగా పేరొందిన ఉస్మానియా యూనివర్సిటీలో 35 ఏళ్లుగా పలు డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

యేడాదిన్నరగా నాన్ టీచింగ్ ఉద్యో గులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిధులు ఇవ్వకుండా వీసీని బాధ్యుడిని చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఓపీఎస్ అమలు, ఈపీఎఫ్ ప్రయోజనాలు, స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం వంటి అంశాలను ప్రస్తావించారు. ఉద్యోగుల సమస్యలపై గవర్నర్ వెంటనే స్పందించాలని కోరారు. జేఏసీగా ఏర్పడి చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాలో సాంకేతికత వినియోగం

విద్యుత్ పంపిణీపై స్పెషల్ సిఎస్ సమీక్ష

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పనితీరుపై విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ సమీక్షించారు. సంస్థ పరిధిలో విద్యుత్ సరఫరా, మౌలిక సదుపాయాలు, వినియోగదారుల సేవలు తదితర అంశాలపై హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ పరిపాలనా నిర్మాణం, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, వివిధ విభాగాల పనితీరు, అమలులో ఉన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. తమ సంస్థ పరిధిలోని జిల్లాలు, విద్యుత్ వినియోగదారుల సంఖ్య, విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్, సబ్‌స్టేషన్లు, విద్యుత్ ఫీడర్లు, పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరా నిర్వహణ, సంస్థ అందిస్తున్న వివిధ రకాల వినియోగదారుల సేవల గురించి తెలియచేశారు. అలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు సంస్థ చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యుత్ సరఫరాలో నాణ్యత, విశ్వసనీయత పెంపుదల, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, విద్యుత్ నష్టాల నియంత్రణ, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార విధానాలు తదితర వాటి అమలు తీరును వెల్లడించారు.

పునరుత్పాదక విద్యుత్‌పై విద్యుత్ శాఖ స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్ సమీక్ష

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో) కార్యకలాపాలపై విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ సమీక్షించారు. హైదరాబాద్‌లోని తన కార్యా లయంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన ఈ సమావేశంలో రెడ్కో ఎండి జితేష్ సంస్థ విధులు, పరిపాలనా కార్యకలాపాలు, అమలు చేస్తున్న వివిధ పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధానంగా మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం, ప్రధానమంత్రి కుసుమ్ పథకం, ఇంధన పొదుపు కార్యక్రమాలు, పునరుత్పాదక ఇంధన విద్యుత్ కొనుగోళ్లలో సాధించిన పురోగతి గూర్చి వివరించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలను ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరు, కొనసాగుతున్న ప్రాజెక్టుల స్థితిగతులు, సంస్థ భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు.

గణపతిహోమంతో కార్తీకమాస పూజలు



తిరుమల, నవంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు మొదలయ్యాయి. నెల రోజుల పాటు జరిగే ఈప్రత్యేక పూజల్లో తోలిగా మంగళవారం గణపతి హోమంతో ప్రారంభించారు. టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ దంపతులు పాల్గొని హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నారు. ఆలయ అర్చకులు హోమాలను నిర్వహించి భక్తులకు శుభాలు కలిగేలా ఆశీర్వాదం చేస్తారు. పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కపిలతీర్థంలో విశ్

వార్త

ఏదైనా పనిలో లీనమైనప్పుడు, ప్రపంచంలోని ఏ విషయమూ నీలో చొరబడకూడదు. కాని చాలా మంది వినోద సమయాలలో కూడా దీనిని పాటించలేరు.

న- చార్లెస్ కింగ్స్‌లే

కేన్సర్ రోగులకు ఉపశమనం!

కలయో నిజమో వైష్ణవ మాయయో అన్నట్లు విస్మయం కలిగించే సమాచారమొకటి 'గిల్లు'కుని స్పర్శ ఉన్నదో లేదో చూసుకునే పరిస్థితి తెచ్చిపెట్టింది. తారాజువ్వలా ఆకాశానికి చేరిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయంటే ఎంత నమ్మకశక్యం కాదో, కేన్సర్ ఔషధాల ధరలు తగ్గాయంటే కూడా అంతే సందేహంగా అనిపిస్తోంది. ఇలా మార్కెట్‌లో ప్రాణాంతక వ్యాధులను నయం చేసే ఔషధాలధరలు తగ్గడమంటే ఎవరూనమ్మలేని నిజం. ఔషధ ధరల నియంత్రణ కోసం ఎన్నోచట్టాలు చేసిన ప్రభుత్వం తన కళ్లెదుటే వాటి ధరలు పెరిగిపోతున్నా, ఆ ఖర్చు తట్టుకోలేక ఎందరో కేన్సర్ రోగుల మరణాలు జరిగిపోతున్నా వాటిని అదుపులో ఉంచగలఅవకాశం, అధికారం ఉన్నా కేంద్రప్రభుత్వం ఇన్నాళ్లూ చేష్టలుడిగి చూసింది. ఈ మధ్యనే సుప్రీంకోర్టు స్వయంగా కలుగచేసుకుని విస్మయం కొలిపే ధరలు, వాటి నియంత్రణ విధివిధానాల్లో లోపాలు తదితర అంశాలన్నిటి మీద, చర్చించి 'కేన్సర్ వ్యాధి నివారణ ఔషధాల ధరలు' తగ్గాల్సిందేనని పట్టుబట్టడంతో కేంద్రం దానికి అంగీకరించింది. ఏ కోర్టుల జోక్యమూ లేకుండా ముందుగానే ఔషధ ధరల నియంత్రణ జరిగి ఉంటే ఈ మధ్యనే ఆరిపోయిన కొన్ని జీవితాలకు పునఃకాంతులు లభించేవి. అంటే వాళ్లకు చావు ఉండదని కాదు. కనీస ఆయుఃప్రమాణం మరికొన్ని రోజులు పెరిగి ఉండేదేమో? అనే అభిప్రాయం కలిగింది. ఎవరో ఆక్రోశిస్తేనో ఏదో ఓ న్యాయవ్యవస్థ ఓ తీర్పు వెలువరిస్తేనో బాధితులకు న్యాయం జరుగుతుందనే సంకేతాలు పంపడం కేంద్రప్రభుత్వానికి ఏమాత్రం మర్యాద కాదు. ప్రభుత్వ పాలకులు ఎవరేనా ఏ పార్టీవారైనా వాటిని నడిపించే బ్యూరోక్రాట్‌ల మేధస్సు కేన్సర్ రోగులపాలిట దయాళువుగా కేంద్రప్రభుత్వం అండదండలుంటాయన్న సంగతి స్పష్టం చేయలేక పోవడం విచారకరం. కారణాలేవైనా గుడ్డిలోమెల్లగా ఇప్పటికైనా కేంద్ర రసాయనాలు ఎరువుల మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ, కేన్సర్ చికిత్సలోవాడే 137రకాల మందుల కనీస విక్రయ ధరను ట్రేడ్ మార్జిన్‌పై పరిమితులు విధిస్తూఉత్తర్వులుజారీచేసింది. తత్ఫలితంగా సోమవారం నుంచి 85 ఔషధ తయారీ కంపెనీలు 121రకాల ఔషధాలకు చెందిన 1.364 ఫార్మూలేషన్‌ల కనీస విక్రయ ధరలను సవరించింది.వీటిలో 679 మందుల ధరలు 50శాతం కన్నా తక్కువకు దిగివచ్చాయి. కొన్నిమందుల ధరల్లో అత్యధికంగా 96.45 శాతం మేరకు తగ్గింది. ఔషధ ధరల విషయం వినియోగదారులు 'చెక్' చేసుకునేందుకు వీలుగా'ఫార్మా సహీ దామ్'మొబైల్ యాప్‌లో పరిశీలించే అవకాశం కల్పించారు. నిర్దారిత ధర కన్నా ఎక్కువ మొత్తాన్ని వసూలు చేసే మందుల దుకాణాలు, ఆస్పత్రుల్లోని 'ఫార్మసీ'ల ఎదురైతే వాటిని ఎన్‌పిపిఏకు ఫిర్యాదు చేయొచ్చునని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సడలింపు వలన దేశవ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఏటా రూ.3540 కోట్లు ఆదా అవుతుందని అంచనా. అంటే ఇన్నాళ్లూ ఆ మేరకు ఫార్మాస్యూటికల్ కంపెనీలు లాభపడ్డాయని వేరే చెప్పనక్కర్లేదు. సాధారణంగా డిస్ట్రిబ్యూటర్ వద్ద రూ.2700కే లభ్యమయ్యే మందును ఆసుపత్రులు, రిటైలర్లు రోగులకు 27వేల రూపాయలకు అంటే పదిరెట్లు లాభాలతో విక్రయించడాన్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. ఇలాంటి 'పగటి దోపిడీ'ని అనుమతించే కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా కోర్టుతీవ్రంగా వ్యాఖ్యానించింది. ఫార్మా కంపెనీలు ప్రైవేట్ ఆస్పత్రుల వాణిజ్య ప్రయోజనాల కంటే దేశపౌరుల ప్రాణాలే ముఖ్యమని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హితవు చెప్పాల్సివచ్చింది. సుప్రీం సూచిస్తేనేకానీ ఆదేశిస్తేనే కానీ ఔషధ ధరల నియంత్రణ మండలి ఇన్నాళ్లూ ఇలా ఎందుకు చోద్యం చూస్తోంది అన్న ప్రశ్న మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఇవన్నీ ఇలాఉంటే సోమవారం నుంచే ధరలతగ్గింపు మొదలౌతుందని స్పష్టంగా ప్రకటిం చినా అది ఎంతవరకు అమలౌతుందో చెప్పలేం. పాతబ్యాచ్ మందులు ఉండిపోయాయనో, కొత్త సరకుకు మాత్రమే ప్రభుత్వ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని ఏమందుల షాపులోనైనా వాదన వస్తే చివరకు హతాశుడయ్యేది రోగే. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఔషధ నియంత్రణ మండలి తీసుకోవాలి. ప్రాణాంతక ఔషధాలకు 30శాతం మార్జిన్ మాత్రమే ఆర్థికప్రయోజనం పొందాలని నిర్దేశించింది. కేన్సర్ చికిత్సలో కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ మందు ల ఖర్చు అధిక వ్యయం అవుతుంది. దాంతో కేన్సర్‌ను రాచ పుండుగా అనాదిగా భావించడం, దాని చికిత్సకు అసలు వైద్యమే లేదనే అపోహ కారణంగా చాలామంది రోగులు వైద్యమే అవసరం లేదనుకునితనువు చాలించడం, ఆపై కేన్సర్ రోగుల కుటుంబాలు కూడా ఆర్థికభారం తట్టుకోలేక కేన్సర్ నయం చేసుకోవడం కష్టమనే ధోరణిలో నిస్పృహతో ఉండిపోయారు. కాలక్రమేణా కేన్సర్ నయమయ్యే విధానంలో ఆధునిక చికిత్సా పద్ధతులు రావడం, ప్రస్తుతం ఔషధ ధరలు తగ్గడం కూడా కేన్సర్ రోగులకు ఊరటకలిగించే అంశాలే! కేన్సర్ చికిత్సా విధానంలో ఇమ్యునోథెరపీ మందులు ఎంతో ప్రధానం. ప్రధానంగా చెప్పుకోవాలంటే రొమ్ముకేన్సర్ చికిత్సలో వాడే 'అనస్ట్రోజోల్' పది మాత్రలు గతంలో రూ.695.76 ఉండగా ప్రస్తుత ధరల తగ్గింపు కేవలం రూ.73కే లభిస్తుంది. కీలక ఔషధాలు ధరలు తగ్గడంతో కేన్సర్‌రోగులను 'చిరాయురస్తు' అని నిస్సందేహంగా దీవించవచ్చు. మందుల ధరలు తగ్గిస్తే ఆయా ఔషధ కంపెనీలు సదరు ఔషధాల ఉత్పత్తులు తగ్గిస్తాయనే అభిప్రాయంతో కేంద్రం అటువైపు దృష్టిసారించలేదు.పైగాఆధునిక కేన్సర్ మందుల తయారీ కోసం భారత్ విదేశీ కంపెనీలపై ఆధారపడి ఉంటుంది. ఈకారణం చేతనే ప్రాణాంతక మందలఔషధ ధరలనియంత్రణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోగలిగింది. ఇవన్నీ ఖచ్చితంగా అమలయ్యే దాకా ప్రభుత్వం ఔషధ విక్రయదారులపై ఓ కన్నేసి ఉంచాలి.

'భద్రత' లేని ఉద్యోగాలతో ఏం ప్రయోజనం?

వైట్ కాలర్ ఉద్యోగాలు చేసేవారికి కొంత వరకైనా బెనిఫిట్స్‌తో పాటు ఉద్యోగ భద్రత వుంది! ముఖ్యంగా లేబర్ ఫోర్స్‌లో లెక్కించే మహిళలకు మెరుగైన స్థితిగతులు ఉద్యోగ పరంగా లేవు. వారికి చైల్డ్ కేర్ సౌకర్యం కల్పించే అవరం వుంది. ఫ్రీగా పనిచేసే చోట్లకు రవాణా సౌకర్యం వుండాలి! నిపుణత సాధించటానికి ట్రయినింగ్ వుండాలి. పనిచేసే చోట జెండర్ పేరుతో వారిని వేరుగా చూసే సంప్రదాయాన్ని మానుకోవాలి! వారికి జీతం తక్కువ ఇచ్చి ఖర్చు తగ్గించే నెపంతో వారి గౌరవాన్ని సమానత్వాన్ని తగ్గించకూడదు! 'ఉద్యోగం పురుష లక్షణం' అన్న నానుడిని పూర్తిగా సమాజం నుంచి తుడిచేయాలి ! నిజానికి ఉద్యోగాలు వున్నాయన్న మాటే గానీ చాలామంది మహిళలు కొందరు పురుషులు గూడా నిరుద్యోగాన్ని మరోవిధంగా అనుభవిస్తున్నట్లుగానే వుండటం శోచనీయం! పని కల్పించటం ముఖ్యం కాదు సామాజికంగా సమానత్వం లేకపోతే అని అనుకోక తప్పదు! పనికి తగ్గ గౌరవం, మర్యాద, జీతం, భద్రత అలాంటి ఉద్యోగాలు చేసే వారు నిరుద్యోగులుగా వున్నట్లే అని అనుకోక తప్పదు.



రావులపాటి సీతారాంరావు

ఉద్యోగం వున్నా సరిపోయే పని జీతం లేకపోవటం కూడా నిరుద్యోగ సమస్య అనే నానాణానికి మరోవైపు అని అనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడే రోజులు వచ్చాయి! ప్రభుత్వోద్యోగాలు రోజురోజుకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చినా తక్కువ అనిపించటానికి కారణం గ్రాడ్యుయేట్లు పోస్టు గ్రాడ్యుయేట్లు లెక్కకు మించి ప్రతి రాష్ట్రంలోని యూనివర్శిటీలు కాలేజీలు ఉత్పత్తి చేయటం వల్లనే! వంద పోస్టులు వుంటే లక్షల్లో పోటీపడే వారు తయారవుతున్న ఈ రోజుల్లో ఏదో ఉద్యోగంతో సరిపుచ్చుకుంటే అది నిరుద్యోగ సమస్యగానే పరిగణించాలి! వ్యవసాయం, పరిశ్రమలు, ప్రభుత్వాలూ, ప్రైవేటు సంస్థలూ, ప్రాజెక్టులూ, కొత్తగా వస్తున్న ఐటి సంస్థలు, బ్యాంకులూ, ఉద్యోగులను రిక్రూట్ చేసుకోటానికి వున్నాయి! అయితే గ్రామ సీమలలో ఎకరాల భూములున్న భూస్వాముల కొడుకులు కూడా వారి దగ్గర పనిచేస్తున్న వారి కంటే తక్కువ స్థాయిలో పట్టణాలల్లో గవర్నమెంటు ఉద్యోగాలు చేయటానికి తయారవుతున్నారు! పట్టణ జీవితానికి అలవాటు పడటం వల్ల, గ్రామాల్లో వ్యవసాయం ఆధునిక పద్ధతులలో చేయించి తాము లాభం పొందటమే కాకుండా తమ వ్యవసాయ భూములలో నికరాదాయం ఇచ్చే విధంగా ఉద్యోగాలు కల్పించే ఆలోచనే చేయటం లేదు! 'దున్నే వాడిదే భూమి' అన్న నినాదం గాలిలో కలిసిపోయింది. దున్నేవాడే కరువయ్యాడు. కొద్దిమంది వున్నా ఆధునిక పరికరాలను ఉపయోగించే రైతుల సంఖ్య పెరిగింది. అందువల్ల నిరుద్యోగం గ్రామాలలో కూడా కొట్టొచ్చినట్లు కనపడుతున్నది. అయితే గణాంకాలు మరో విధంగా వున్నాయి. ఇండియాలో అన్‌ఎంప్లాయిమెంటు రేటు 6.1 నుంచి (2017-18) 2023-24 కు 3.2 శాతం తగ్గింది. మహిళా ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగిందని (పోయిన దశాబ్దంలో) ప్రభుత్వ రికార్డులు తెల్పుతున్నాయి. బయటకు బాగా నిరుద్యోగ సమస్య వున్నట్లు కనపడుతున్నా ప్రభుత్వ లెక్కలు ఆశాజనకంగా వుండటంతో ఎలాంటి ఉద్యోగాలు ఈ మధ్యకాలంలో ఉత్పత్తి చేయబడ్డాయి? ఏవిధమైన పని పరిస్థితులు (వర్కింగ్ కండిషన్లు) ఆ ఉద్యోగాల్లో వున్నాయన్న మదింపు చేయక తప్పదు! ఎందుకంటే కేవలం నిరుద్యోగం వల్లనే స్థిరమైన జీవన భృతి రక్షణ, గౌరవ ప్రదమైన జీవనం వుండవు అనుకోవటం పొరపాటు. చేసే ఉద్యోగం ఏదైనా ఉద్యోగ రక్షణ పరంగా కాంట్రాక్టు లేకపోవటం, ఇన్సూరెన్స్ కవరేజి, సెలవులు లేకపోవటం, మర్యాద పూర్వకంగా లేని ఉద్యోగమవుతే, దాన్ని ఉద్యోగంగా పరిగణించటం కుదరదు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐయల్) మర్యాద పూర్వకమైన ఉద్యోగం ఏమిటో నిర్వచించింది. ఆ ఉద్యోగంలో పనికి తగ్గ జీతం, పనిచేసే చోట వుండాల్సిన హక్కులూ, సామాజిక



భద్రతతో బాటు డిగ్నిటీ వున్నదే 'డీసెంట్ ఉద్యోగం'గా గుర్తించబడుతుందని ఐఎల్‌ఓ ప్రామాణీకరణ చేయటం గమనించక తప్పదు! ఉద్యోగ రక్షణ ఉద్యోగంలోన అవకాశాలూ, సామాజిక భద్రత, అయిదు పెద్ద పరిశ్రమలలో అంటే వ్యవసాయం, ఉత్పత్తి సంస్థలు, నిర్మాణ సంస్థలూ, హోల్సేల్, రిటైల్ సంస్థలు, రవాణా సంస్థలు పరిశీలించినప్పుడు కొంత అభివృద్ధి భారత దేశం సాధించింది అన్న అభిప్రాయం వుంది! పని పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి అని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పియల్‌ఎఫ్) విశ్లేషించింది. అయితే స్థూలంగా లెక్కించినప్పుడు అభివృద్ధి స్థాయి ఆందోళన కలిగించేంత తక్కువగా ఉందని గూడా తేల్చి చెప్పింది! అభివృద్ధి పైన ఉదహరించిన సంస్థలలో ఒకే తీరుగా లేదని కూడా పేర్కొంది! వ్యవసాయ పరిశ్రమలో పెద్ద ఎత్తున పనివారు వున్నారు కానీ ఆ పనిలోని నాణ్యతలో మెరుగుదల లేదు. ఇంకా తక్కువ స్థాయిలోనే వుంది. ప్రావిడెంట్ ఫండ్ ఇన్సూరెన్సు బెనిఫిట్స్ లాంటివి ఈ వ్యవస్థలో వుండటం ఊహకందని విషయమే! దాదాపు 90 వర్క్‌ఫోర్స్ చాలా వరకు మాటమీద భద్రత లేని ఉద్యోగాలు లిఖిత పూర్వకమైన కాంట్రాక్టులు లేకుండా చేసేవారే అని తేల్చి చెప్పింది! సామాజిక సమత్వం చాలా వరకు ఉద్యోగపరంగా మన దేశంలో ఇంకా సాధ్యపడలేదు! కాజువల్ ఉద్యోగాలు మీదనే బ్రతుకుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. కొంతమేర సామాజిక సమత్వం పట్టణాలలోని వివిధ ఉద్యోగ విభాగాలలో కనపడుతున్నది. నిజానికి అసమానత్వం వృత్తుల్లో ఉద్యోగాలలో, ప్రాంతీయ, కుల,మత, జెండర్‌లను బట్టి వుండటం ఇబ్బంది పెట్టే విషయంగానే ఇన్ని సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా వుండటం దురదృష్టకరం. స్థిరమైన అభివృద్ధి అన్ని రంగాల ఉద్యోగస్థుల్లో సాధించాలంటే సామాజిక భద్రత అందరికీ ఉండాల్సిన అవసరం వుంది. ఉద్యోగ పరంగా సొంతంగా ఉద్యోగాన్ని తన కోసం చేసేవాడు (సెల్ఫ్ ఎంప్లాయిడ్) రైతులు, రోజువారీ ఉద్యోగాలు ఎలాంటి కాంట్రాక్టులు లేకుండా చేసే వారిపై ప్రభుత్వాలు దృష్టిపెట్టి వారి ఉద్యోగాలకు స్థిరత్వాన్ని ఏర్పాటు చేయక తప్పదు. అది ప్రభుత్వాల బాధ్యత కూడా! వారికి నిజమైన రక్షణ అవసరం కేవలం కాగితాలలో కన్పిస్తే కుదరదు! లేబర్గా గుర్తించబడుతున్న వర్క్‌ఫోర్స్ విషయంలో తగిన శ్రద్ధ పెట్టక తప్పదు. వైట్ కాలర్ ఉద్యోగాలు చేసేవారికి కొంత వరకైనా బెనిఫిట్స్‌తో పాటు ఉద్యోగ భద్రత వుంది! ముఖ్యంగా లేబర్ ఫోర్స్‌లో లెక్కించే మహిళలకు మెరుగైన స్థితిగతులు ఉద్యోగ పరంగా లేవు. వారికి చైల్డ్ కేర్ సౌకర్యం కల్పించే అవరం వుంది. ఫ్రీగా పనిచేసే చోట్లకు రవాణా సౌకర్యం వుండాలి! నిపుణత సాధించటానికి ట్రయినింగ్ వుండాలి. పనిచేసే చోట జెండర్ పేరుతో వారిని వేరుగా చూసే సంప్రదాయాన్ని మానుకోవాలి! వారికి జీతం తక్కువ ఇచ్చి ఖర్చు తగ్గించే నెపంతో వారి గౌరవాన్ని సమానత్వాన్ని తగ్గించకూడదు! 'ఉద్యోగం పురుష లక్షణం' అన్న నానుడిని పూర్తిగా సమాజం నుంచి తుడిచేయాలి! నిజానికి ఉద్యోగాలు వున్నాయన్న మాటేగానీ చాలామంది మహిళలు కొందరు పురుషులు గూడా నిరుద్యోగాన్ని మరోవిధంగా అనుభవిస్తున్నట్లుగానే వుండటం శోచనీయం! పని కల్పించటం ముఖ్యం కాదు సామాజికంగా సమానత్వం లేకపోతే అని అనుకోక తప్పదు! పనికి తగ్గ గౌరవం మర్యాద జీతం, భద్రత అలాంటి ఉద్యోగాలు చేసే వారు నిరుద్యోగులుగా వున్నట్లే అని అనుకోకతప్పదు.

బొగ్గు కార్మికులకు విస్తృత పెన్షన్‌నిధి అవసరం

ఆళవందార్ వేణు మాధవ్

దేశ పారిశ్రామిక అభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి బొగ్గు గని కార్మికుల శ్రమ ఎనలేనిది. విద్యుత్ ఉత్పత్తి నుంచి ఉక్కు పరిశ్రమ వరకు, సిమెంట్ తయారీ నుంచి అనేక పారిశ్రామిక రంగాల వరకు బొగ్గు కీలకమైన ముడిసరుకు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసిన కార్మికులు తమ జీవితంలో విలువైన సంవత్సరాలను దేశ నిర్మాణానికి అంకితంచేశారు.అలాంటి కార్మికులు పదవీ విరమణ చేసిన తర్వాత గౌరవప్రదమైన జీవితం గడపడానికి పెన్షన్‌ఒక్కటే ప్రధాన ఆధారం.అయితే నేడు బొగ్గుగని కార్మికుల పెన్షన్‌వ్యవస్థ భవిష్యత్తుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బొగ్గుగని కార్మికుల కోసం అమలులో ఉన్న కోల్‌మైన్స్ పెన్షన్ స్కీమ్-1998 లక్ష్యంపదవీ విరమణచేసిన కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం. కానీ కాలక్రమేణా పెరుగుతున్న జీవన వ్యయం,వైద్యఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు పెన్షనర్ల జీవితాలను భారంగా మార్చాయి.మరోవైపు కనీస పెన్షన్, కరవుభత్యం, పెన్షన్ సవరణ వంటి అంశాలు ఇంకా పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెన్షనుపెంచాలని కోరడం ఎంతముఖ్యమో, ప్రస్తుతం అమలులో ఉన్న పెన్షన్ వ్యవస్థను దీర్ఘకాలం కొనసాగించేలా పెన్షన్ నిధిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యం. పెన్షన్ పెంపుకోసం పోరాడుతూనే పెన్షన్ ఫండ్ ఆర్థిక స్థితిగతులపై కూడా సమగ్ర చర్చజరగాలి. పెన్షన్ నిధికి సంబంధించి బొగ్గు సంస్థ యాజమాన్యాలు 2017నుంచి 7 శాతం, ఉద్యోగుల బేసిక్ జీతం నుంచి 7శాతం చందాల విధానం అమలు జరుగుతుంది, సెప్టెంబర్ 2020 నుంచి ప్రతి టన్ను బొగ్గుపై రూ.10,ఏప్రిల్ 2025 నుంచి ప్రతి టన్ను బొగ్గుపై రూ.20విరాళం బొగ్గు యాజమాన్యాల నుంచి నిధుల సమీకరణ చర్యలు అమలులోకి వచ్చింది. అయితే ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పెన్షన్ వ్యవస్థ ఆర్థికంగా ఎంత వరకు బలోపేతమైంది? భవిష్యత్తులో పెన్షనర్లకు నిరంతరాయంగా పెన్షన్ చెల్లించడానికి అవసరమైన నిధులు సమకూరుతున్నాయా? పెన్షన్ ఫండ్ ఆదాయం,వ్యయం, పెట్టుబడులు, భవిష్యత్తు బాధ్యతలపై సమగ్ర లెక్కలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? అనేప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. పెన్షన్ ఫండ్ ఆర్థికపరిస్థితిపైఅనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు ప్రభుత్వం, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ బొగ్గు పరిశ్రమ యాజమాన్యాలు వాస్తవ గణాంకాలను వెల్లడించాలి. నిధుల కొరత ఉంటే దాని కారణాలు ఏమిటి? లోటును పూడ్చడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి? భవిష్యత్తులో పెన్షన్ చెల్లింపులకు ఎలాంటి భరోసా కల్పించబోతున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలి. బొగ్గు పరిశ్రమలో యాంత్రీకరణ, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదల, ఉద్యోగ నియామకాల్లో మార్పుల కారణంగా ప్రస్తుత ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది. అదే సమయంలో గతంలో పనిచేసి పదవీ విరమణచేసిన ఉద్యోగులు, కుటుంబ పెన్షనర్లసంఖ్య పెరుగుతోంది. దీనివల్ల పెన్షన్ నిధిపై భవిష్యత్తులో ఆర్థిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. వేతన సవరణలతో భవిష్యత్తులో పెన్షన్ చెల్లింపుల బాధ్యతలు కూడా పెరిగేపరిస్థితి ఉంటుంది. ఈ మార్పులను ముందుగానే అంచనా వేసి శాస్త్రీయమైన ఆర్థిక ప్రణాళిక రూపొందించాలి. కేవలం ప్రస్తుత అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాకుండారాబోయే పదేళ్లు,ఇరవై ఏళ్లపెన్షన్ బాధ్యతలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. తెలంగాణలో బొగ్గుపరిశ్రమకు వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థలో వేలాది మంది కార్మికులు దశాబ్దాల పాటు శ్రమించి పదవీ విరమణ చేశారు. వారి జీవితాలు కూడా కోల్‌మైన్స్ పెన్షన్ స్కీమ్‌తో ముడిపడి ఉన్నాయి. సింగరేణిలో కేంద్రప్రభుత్వానికి 49శాతం, రాష్ట్రప్రభుత్వానికి 51శాతం వాటా ఉన్న నేపథ్యంలో రెండు ప్రభుత్వాలు కూడా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి. పెన్షనర్ల హక్కుల కోసం పనిచేస్తున్న సంఘాలు, సంక్షేమ సంస్థలు కేవలం సభలు నిర్వహించడం, వినతిపత్రాలు సమర్పించడం,ఫోటోలు ప్రచురించడం వరకే పరిమితం కాకూడదు. పెన్షన్ నిధిపరిస్థితిపై అధ్యయనం చేయాలి. నిధుల ఆదాయ వ్యయాల వివరాలను సేకరించాలి. పెన్షన్ పెంపుకోసం పోరాటం చేయడం అవసరం. అదే సమయంలో పెన్షన్ నిధి భద్రతను నిర్లక్ష్యం చేయడం భవిష్యత్తు తరాల పట్ల అన్యాయం చేసినట్లే అవుతుంది. నేడు పెన్షన్‌పొందుతున్న వృద్ధుల జీవన గౌరవం ఎంత ముఖ్యమో, రేపుపదవీ విరమణ చేయబోయే ఉద్యోగుల భవిష్యత్తు కూడాఅంతే ముఖ్యం.కాబట్టి పెన్షన్‌పెంపు, పెన్షన్‌నిధి పరిరక్షణ రెండింటినీవేర్వేరు అంశాలుగా కాకుండా పరస్పరం అనుసంధానమైన లక్ష్యాలుగా చూడాలి.ప్రభుత్వాలు, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, బొగ్గు పరిశ్రమ యాజమాన్యాలు, అందరుకలిసిపనిచేయాలి.

దేశ తలరాతను మార్చేది నైపుణ్య విద్య మాత్రమే!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

దేశ ఘన చరిత్రను మార్చి రాయగలిగేది విద్యావేత్తలు మాత్రమే. దేశ, ప్రపంచ దశ దిశలకు మార్గదర్శకత్వం వహించేది విద్యావేత్తలే. ఒక దేశ సామర్థ్యం విద్యావేత్తలతో ఉంటుంది. రేపటి సమాజ స్థితి గతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యాప్తికాదు, మేధోవ్యవస్థ. సమాజగతినిమార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. కత్తి కన్న కలం గొప్పది దిగని కూజా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయింది. వ్యక్తి, కుటుంబ, దేశ ప్రగతికి బాటలు వేయగలిగేది విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖామంత్రి(1947-58), విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు, దార్శనికుడు, సమైక్యతావాది మేధావి, రచయిత, పరిపాలనాదక్షుడు, భారత రత్న అయిన మోలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా 11 నవంబర్‌న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ విద్యా దినోత్సవం ఇతివృత్తంగా 'విద్యను సహసృష్టి చేయడంలో యువశక్తి' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. నేటి భారత విద్యా విధానానికి గట్టి బీజాలు వేసిన మహాయోధుడు అబుల్ కలాం. ఆయన నేతృత్వంలోనే భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఏఐసిటిఈ, ఐఐఎసిసి యూజిసి, వయోజన విద్య లాంటివి నెలకొల్పి దేశ యువతను అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి చక్కటి మార్గాన్ని వేశారు. ఒక బాలిక లేదా యువతి ఒక తరగతి ఎక్కువగా చదివితే ఆవిడ భవిష్యత్తు ఆదాయం 20శాతం వరకు పెరుగుతుందని పేర్కొనబడింది. మహిళ, బాలికల నిర్బంధ ఉచిత విద్యకు పెద్దపీట వేసిన కలాం దార్శనికత కొనియాడదగింది. చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మిన మేధావి మన కలాం. విద్య ప్రయోజనాలలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ ఉద్యోగం,సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాన్ని తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాల



ను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటివి అనేకం ఉన్నాయి. విద్యార్థి కేంద్రిత విద్య లేదా స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం,విలక్షణ ఆలోచనలకు ఊతంఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకుపట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటివిద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి ప్రతిభ దేశానికి దోహదపడుతుంది.నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. జాతీయ విద్యా దినోత్సవ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడింగ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్యఅంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు. నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షాఅభియాన్,డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్‌లో అక్షరాస్యత రేడు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా96.9 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 61.8శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగ

మా అత్తకు కోపంవస్తే వణికిపోయేదాన్ని!

ఆత్మకథ పుస్తకంలో సోనియా గాంధీ



న్యూఢిల్లీ, నవంబరు 10: బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ బుక్‌లో సోనియా గాంధీ తన అత్త ఇందిరా గాంధీ గురించి రాశారు. ఇందిరా గాంధీకి కోపం వస్తే, తాను కుర్చీలో వణికిపోయేదాన్ని అని పేర్కొన్నారు. ఇందిర ఎంత స్థిరమైన వ్యక్తో ఆమె టెంపర్ ద్వారా తెలిసేదన్నారు. నెహ్రూ గాంధీ కుటుంబంలో కొత్తగా అడుగుపెట్టిన రోజుల్లో జరిగిన కొన్ని ఘటనల గురించి సోనియా తన బుక్‌లో వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి కోపం ఎక్కువన్నారు. ఇందిర ఆవేశాన్ని ప్రదర్శిస్తే, అక్కడ ఉన్న అందరూ వణికిపోయేవారని సోనియా గుర్తు చేశారు. 544 పేజీల బుక్‌లో ఇందిర గురించి సోనియా అనేక అంశాలను తెలిపారు. అత్త ఇందిర అకస్మాత్తుగా కొన్ని సందర్భాల్లో అరిచేదని, ఆ సమయంలో తాను కూడా వణికిపోయేదాన్ని అని సోనియా తన బుక్‌లో తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఉన్న సిబ్బంది కూడా స్తంభించిపోయేవారన్నారు. ముఖ్యమైన అపాయింట్‌మెంట్ గురించి గుర్తు చేయని ఓ సిబ్బందిని రూమ్‌లో ఓ కార్నర్‌లో నిల్చోబెట్టినట్లు ఇందిర గురించి సోనియా తెలిపారు. కుర్తా దోతీ ధరించిన ఓ వ్యక్తి కూడా ఓ సందర్భంలో రూమ్‌లో రోజంతా నిలబడినట్లు ఆమె రాశారు. ఇందిర గాంధీ సిబ్బందిలో ఉన్న సీనియర్ సభ్యురాలు ఆమీ ఆంటీతో రోజూ అరగంట గడిపినట్లు సోనియా బుక్‌లో రాశారు. అత్త చెప్పినట్లు ఓ సీనియర్ నాయకుడు రూమ్‌లో గోడకు అతుక్కుపోయినట్లు సోనియా గుర్తు చేశారు. తన అయిష్టాన్ని ఇందిర వ్యక్తం చేసే విధానం భిన్నమైందన్నారు. అలాంటి వ్యక్తులను అసలు పట్టించుకునేది కాదన్నారు. భోజనం చేస్తున్న సమయంలో కూడా ఇందిరా గాంధీ కొన్ని సందర్భాల్లో ఆవేశానికి లోనయ్యేవారని రాశారు. పార్లమెంట్‌లో ఏదైనా ఘాటు సందర్భం ఏర్పడిన రోజు డైనింగ్ టేబుల్ మీద కూడా ఇందిర కోపంగా ఉండేదన్నారు. ఓసారి అత్త ఇందిర భోజన పల్లెంను డైనింగ్ టేబుల్‌పై విసిరేసినట్లు సోనియా తెలిపారు. మొదట్లో ఇందిర ఆవేశం తనను ఇబ్బందిపెట్టేదన్నారు. తన తండ్రి టెంపర్‌ను గుర్తు చేసేదన్నారు. కొన్ని సందర్భాల్లో చలించేదాన్ని అని, వణికిపోయేదాన్ని అని రాశారు. ఆ సమయంలో రాజీవ్ గాంధీతో పాటు సంజయ్ కూడా మౌనంగా కూర్చునేవాళ్లు అని రాశారు. ఆ క్షణం గడిసిపోయే వరకు ఎదురుచూసేవారన్నారు. భయపడవద్దు అని రాజీవ్ తనకు ధైర్యం చెప్పేవారని, కొంత సమయంలో తల్లి మళ్లీ సాధారణ స్థాయికి వస్తుందనేవారు. ఇందిర గురించి పూర్తిగా తెలుసుకునే వరకు సీటులో కూర్చున్నా వణికిపోయేదాన్ని అని సోనియా తన బుక్‌లో రాశారు. ఒకవేళ ఇందిర ఆవేశానికి లోనైనా, ఆ తర్వాత ఆమె పశ్చాతాపం వ్యక్తం చేసేదని సోనియా తెలిపారు. కానీ తన నమ్మకాన్ని వమ్ము చేసిన వారిని మాత్రం అసలు క్షమించేదికాదన్నారు. ఆ వ్యక్తిని ఇందిర ఎప్పటికీ దూరం చేసుకునేదని సోనియా గుర్తు చేశారు. పాత ఫోటోలు, చీరలు, కశ్మీరీ శాలువలను ఇందిరా గాంధీ ఎక్కువగా ఇష్టపడేదని సోనియా రాశారు. పాత్ ఫోటోలను తేదీలుగా పేర్చేదన్నారు. కొన్ని సందర్భాల్లో తన చీరలను బయటకు తీసి, వాటిని ఓ పద్ధతి ప్రకారం అమర్చేదన్నారు. కొన్ని కొన్ని చీరలను ఇందిర మూటకట్టి వాటికి ట్యాగ్‌లు పెట్టేదని సోనియా తన బుక్‌లో రాశారు. ఒక్కసారి కట్టిన చీరలను మరో చోట పేర్చేదన్నారు. బంధువులకు కొన్ని సందర్భాల్లో చీరలను ఇందిర పంపేదని రాశారు. సోనియాకు చీరలు అంటే అమితమైన ఇష్టమని, తల్లి చీరలను కూడా ఇందిర తన అల్మారాలో ఉంచుకున్నట్లు సోనియా రాశారు. అయితే నానమ్మ అయిన తర్వాత ఇందిరలో ఆవేశం కాస్త నెమ్మదించినట్లు సోనియా పేర్కొన్నారు. మనవళ్లు పెద్ద అయిన తర్వాత ముందుగా ఇందిర మనసును తెలుసుకునేందుకు పిల్లల్ని పంపేవాళ్లమని, అయితే మనవళ్లు రాగానే ఇందిర మనసు వెన్నలా మారేదని సోనియా రాశారు. పిల్లలు నవ్వినా లేదా అమాయకంగా ప్రశ్న వేసినా ఇందిర కరిగిపోయేదన్నారు. ఆ సమయంలో ఇందిర రిలాక్స్ అయ్యేదని సోనియా తెలిపారు.

మేనకగాంధీ విడిపోవడం అంతా ఓ రియాల్టీషోగా నడిచింది!

న్యూఢిల్లీ, నవంబరు 10: ఇందిరా గాంధీతో విభేదాలు, సంజయ్ గాంధీ మరణానంతరం జరిగిన పరిణామాలు, రాజకీయ పరిస్థితుల వల్ల మేనక కుటుంబం నుంచి విడిపోవడానికి దారితీసిన పరిస్థితులను సోనియాగాంధీ పుస్తకంలో వివరించారు. మేనకా గాంధీ కుటుంబం నుంచి విడిపోవడానికి దారితీసిన నాటకీయ పరిణామాలను ఒక రియాలిటీ షోగా అభిప్రాయపడ్డారు. బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ పేరుతో హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించిన ఈ పుస్తకం మంగళవారం మార్కెట్‌లోకి వచ్చింది. రాజీవ్, సంజయ్ గాంధీలు ఒకప్పుడు విడదీయరాని సోదరులుగా ఉండేవారని సోనియా గుర్తు చేశారు. కానీ, సంజయ్‌పై మేనక ప్రభావం పెరిగిన తర్వాత అన్నదమ్ముల బంధంలో చేదు అనుభవాలు మొదలయ్యాయని రాశారు. ఎమర్జెన్సీ సమయంలో సంజయ్ తీసుకున్న కొన్ని దూకుడు నిర్ణయాలు, ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీని విమర్శించేలా ఇచ్చిన ఇంటర్వ్యూల వెనుక మేనక ప్రోత్సాహం ఉందనేది ఇందిర గాంధీ భావించిందన్నారు. ఆ సమయంలో మేనకను ఉద్దేశించి ఇందిరా గాంధీ కేబినెట్ సెక్రటరీ పి.ఎన్. ధార్‌తో ఆమెకు అప్పుడే రెక్కలు రావడం మొదలైందని వ్యాఖ్యానించినట్లు పుస్తకంలో పేర్కొన్నారు. అయితే, 1980 జూన్ 23న విమాన ప్రమాదంలో సంజయ్ గాంధీ మరణించిన తర్వాత పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చాయని సోనియా వివరించారు. ఇరవై మూడేళ్ల వయసులో మేనక ఇంకా చాలా చిన్నదని, నాయకత్వ బాధ్యతలు చేపట్టేంత పరిణతి ఆమెకు లేదని ఇందిరా గాంధీ భావించారు. అప్పటికి ఆమెకు మూడు నెలల పసిబిడ్డ ఉన్నందున, ఆ బిడ్డతో ఉండటం అవసరమని ఆమె అనుకున్నారు. కాస్త ఓపిక పట్టాలని, భవిష్యత్తులో తన రాజకీయ ఆశయాలను నెరవేర్చుకోవడానికి తగినంత సమయం ఉంటుందని ఆమెకు నచ్చజెప్పాలని చూశారు. మేనక లక్ష్యాలు వేరే ఉన్నాయని స్పష్టమైపోయిందని సోనియా గాంధీ అన్నారు. సంజయ్ మరణించి ఏడాది కూడా గడవకముందే, కుటుంబం నుంచి మేనక విడిపోతున్నారనే విషయం అర్థమైంది. వారి బిడ్డ మొదటి పుట్టినరోజు సందర్భంగా ఇందిర ఒక చిన్న సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అనుకున్నారు. మనవడి పుట్టినరోజు వేడుక నిజంగానే జరిగిందని, అది గ్వాలియర్ రాజమాత కుమార్తె, ఆర్ఎస్ఎస్‌కు గట్టి మద్దతుదారు, రాజకీయ ప్రత్యర్థి అయిన వసుంధర రాజే ఇంట్లో జరిగిందని ఇందిరా గాంధీ తరువాత తెలుసుకున్నారు. అది స్పష్టంగా ఆమెను గాయపరిచేందుకే ఉద్దేశించింది. ఇంకా ఇందిర గాంధీ అధికారిక పర్యటన నిమిత్తం లండన్‌లో ఉన్నప్పుడు, మేనకా తన సామానును ఇంటి నుంచి తరలిస్తున్నట్లు వార్త అందింది. తిరిగి వచ్చిన తర్వాత ఆమె కార్యకలాపాలకు మందలించారు. దీంతో ఆమె దూరంగా ఉండటమా, లేక వేరే చోట నివసించడమా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఇందిరా గాంధీ స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా మేనక అనేక ఆరోపణలతో కూడిన లేఖను ఇందిరకు పంపారు. నింద అంతా ఇందిరా గాంధీపై వేసి, సంచలనం సృష్టించి ఇల్లు వదిలి వెళ్లాలనేది మేనక ప్లాన్ అని, ఈ విషయాన్ని ఆమె ముందే ఒక జర్నలిస్ట్ మిత్రుడికి చెప్పారు. మేనక ఇల్లు విడిచి వెళ్లిన తీరు, ఆ తర్వాత జరిగిన ప్రచారాలు ఇప్పటి కాలపు ఒక రియాలిటీ షోలా సాగాయని సోనియా అభివర్ణించారు. పిల్లలు పెద్దయ్యాక, ఇంట్లో ఆమె మూడ్ ఎలా ఉందో తెలుసుకోవడానికి వారినే పంపేవారు.

షాక్ ఎందుకు? నా తండ్రికి ప్రధాని అయ్యే అర్హతలన్నీ ఉన్నాయి!

సోనియా ఆత్మకథ పుస్తకంలో వ్యాఖ్యలపై ప్రణబ్ కుమార్తె ఫైర్



న్యూఢిల్లీ, నవంబరు 10: దివంగత నేత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రధాని కావాలని అనుకున్నట్టు తనకు అనిపించిందని కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావించిన వైనం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై ప్రణబ్ కూతురు శర్మిష్ఠా ముఖర్జీ తాజాగా స్పందించారు. ప్రణబ్ లక్ష్యంపై ఆశ్చర్యపోవాల్సిన పనేమిటని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె పోస్టు పెట్టారు. ప్రధాని పదవికి కావాల్సిన రాజకీయ, పరిపాలన అనుభవం తన తండ్రికి ఉందన్నారు. అద్భుతమైన మేధో శక్తి, కష్టించి పనిచేసే గుణం ఉందని చెప్పారు. ప్రధాని కావాలనుకున్నారా అని తానూ తండ్రిని గతంలో అడిగానని చెప్పారు. సత్తా ఉన్నా రాజకీయనాయకుడు ఎవరైనా ప్రధాని కావాలని కోరుకుంటారని ప్రణబ్ బదులిచ్చారని గుర్తు చేసుకున్నారు. ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది ఉన్నత లక్ష్యాలు ఉండటం నేరమా రాజకీయాల్లో, పరిపాలనలో దశాబ్దాల అనుభవం, కష్టపడి పనిచేసే నైజం, మేధోశక్తి ఉన్నప్పుడు ఇందులో తప్పేముందని శర్మిష్ఠ ప్రశ్నించారు. నా తండ్రి సాధారణ నేపథ్యం నుంచి వచ్చారు. కఠోర శ్రమ, మేధో శక్తి ఆధారంగా జీవితంలో పైకెదిగారు. ఎవరూ ఆయనకు ఉన్నతస్థానాలను చెతికందివ్వలేదని అన్నారు. అన్ని అర్హతలు ఉన్న వ్యక్తి ప్రధాని కావాలనుకోవడంలో తప్పేముంది గాంధీ నెహ్రూ కుటుంబానికి చెందని ఓ వ్యక్తి ప్రధాని కావాలనుకోవడమే కాకుండా తనకు సంకేతాలు ఇచ్చేందుకు సాహసించడంపై సోనియా షాకయ్యారా అని ప్రశ్నించారు. 2010లో ప్రణబ్‌తో సంభాషణ గురించి ఎంపీ సోనియా గాంధీ తన ఆత్మకథ బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్‌లో పేర్కొన్నారు. అప్పటి ఆర్థికమంత్రి చిదంబరంతో పొసగని వైనంపై ప్రణబ్ తనతో చెప్పారని అన్నారు. పైస్థాయిలో మార్పునకు సమయం వచ్చిందని ప్రణబ్ వ్యాఖ్యానించారని చెప్పారు.

సోనియా ఆత్మకథకు వైట్‌వాషింగ్ అని పేరుపెట్టాలి?

ఆమె పుస్తకంలోని రాతలపై బిజెపి వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 10: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్‌ఖి పుస్తకంపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, నెహ్రూగాంధీ కుటుంబం గతంలో చేసిన తప్పిదాలను కప్పిపుచ్చి, వాటిని సమర్థించుకునే ప్రయత్నమే ఈ పుస్తకమని ఆరోపించారు. ఆ పుస్తకానికి బిలాంగింగ్ అని కాకుండా వైట్‌వాషింగ్ అని పేరు పెట్టి ఉండాల్సిందని ఎద్దేవా చేసింది. ఎమర్జెన్సీని సమర్థించే ప్రయత్నం చేశారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ వ్యాఖ్యానించారు. సోనియా తన పుస్తకంలో బాబ్రీ మసీదు, 1984 సిక్కుల ఊచకోత, బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్, 26/11 ముంబయి ఉగ్రదాడుల గురించి చేసిన ప్రస్తావనలను కేశవన్ ప్రశ్నించారు. బాబ్రీ మసీదు ఘటనపై కన్నీరు పెట్టుకున్నట్లు చెప్పిన సోనియా, 1984లో గురుద్వారాలపై దాడులు, వేలాది మంది అమాయక సిక్కుల హత్యలపై అదే విధంగా స్పందించారా అని నిలదీశారు. ఆ ఘటనలు కాంగ్రెస్ పాలనలోనే జరిగాయని విమర్శించారు. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదుల గురించి సోనియా తీవ్రంగా బాధపడినట్లు వచ్చిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రస్తావించారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన భద్రతా సిబ్బంది, 26/11 ముంబయి దాడుల్లో మరణించిన అమాయకుల గురించి ఆమె అదే స్థాయిలో విచారం వ్యక్తం చేశారా అని ప్రశ్నించారు. ఆ ఉగ్రదాడుల సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి పుస్తకంలో ఏమి వివరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ 2004లో ప్రధానమంత్రి పదవిని స్వీకరించకుండా తప్పుకున్నట్లు చెప్పడంపైనా జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ ఝా అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్నాలో మాట్లాడిన ఆయన, అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్ సోనియాకు మద్దతు ఇవ్వడానికి నిరాకరించారని పేర్కొన్నారు. సంఖ్యాబలం సమకూర్చుకునే ప్రయత్నాలు జరిగాయని, ములాయం మద్దతు నిరాకరించడంతోనే ఆమె ప్రధాని కాలేకపోయారని తనకు తెలిసిన సమాచారం ఆధారంగా వ్యాఖ్యానించారు. ఇందిరా గాంధీ స్వయంగా ఎమర్జెన్సీ విధించాలని అనుకోలేదని, కొందరి సలహాతో ఆ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నట్లు పత్రికలో చదివానని, ప్రధానిగా ఉన్న వ్యక్తి ఇతరుల సలహాలను కారణంగా చూపడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

రాజీవ్‌గాంధీ భద్రతపై రెండు నెలల ముందే రాహుల్ సందేహం!

ముందే హెచ్చరించిన రాహుల్.. సోనియా ఆత్మకథలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 10: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జ్ఞాపకాల పుస్తకం బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ ఇవాళ విడుదలైంది. ఈ పుస్తకంలో తన జీవితంలో జరిగిన అనేక సంఘటనలను ఆమె గుర్తు చేసుకున్నారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ హత్యకు గురైన విషాద ఘటనను ఈ పుస్తకంలో మరోసారి గుర్తుచేసుకున్నారు. 1991 మే 21వ తేదీన తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో రాజీవ్ గాంధీ ప్రాణాలు కోల్పోయిన రోజు తన జీవితంలో అత్యంత విషాదకరమైన క్షణమని వివరించారు. అంతేకాదు రాజీవ్ గాంధీ భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఆయన అంత్యక్రియలకు రావాల్సి వస్తుందని రాహుల్ గాంధీ రెండు నెలల ముందే హెచ్చరించిన విషయాన్ని కూడా వెల్లడించారు. రాజీవ్ గాంధీతో కలిసి పర్యటనకు వెళ్లిన సమయంలో రాహుల్ గాంధీ తనతో భద్రతా అంశంపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సోనియా పుస్తకంలో రాశారు. నాన్న భద్రత విషయంలో ఏదైనా చర్య తీసుకోకపోతే, త్వరలోనే ఆయన అంత్యక్రియలకు హాజరు కావడానికి నేను తిరిగి రావాల్సి వస్తుందని నాకు తెలుసు అని రాహుల్ గాంధీ చెప్పినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ మాటలు జరిగిన 2 నెలలకే రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారని తెలిపారు. శ్రీపెరంబుదూర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమానికి హాజరైన రాజీవ్ గాంధీ వద్దకు ఓ మహిళ పూలమాల వేసే నెపంతో వెళ్లింది. ఆమె శరీరానికి కట్టుకున్న పేలుడు పదార్థాలను పేల్చడంతో రాజీవ్ గాంధీతో పాటు మరో 14 మంది మరణించారు.

రాహుల్‌కంటే ముందే ఒక బిడ్డ పుట్టిపోయాడు!

తన ఆత్మకథలో సోనియా భావోద్వేగం!



న్యూఢిల్లీ, నవంబరు 10: కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ తన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్‌లో బయట ప్రపంచానికి తెలియని అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన వైవాహిక జీవితంలో ఎదురైన అనుభవాలను ఇందులో పంచుకున్నారు. రాజీవ్ గాంధీతో వివాహం, ఇందిరా గాంధీ తనపట్ల చూపిన వాత్సల్యం ఇలా అనేక అంశాలను అందులో రాశారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ కంటే ముందు తనకు ఓ బిడ్డ పుట్టి చనిపోయిన విషాదం గురించి సోనియా తన పుస్తకంలో పంచుకున్నారు. సెప్టెంబరు 1968లో సోనియా గాంధీ గర్భం దాల్చినట్లు ప్రకటించడంతో ఇల్లు ఆనందోత్సాహాలతో నిండిపోయింది. సాధారణంగా గంభీరంగా ఉండే ఇందిరా గాంధీ కూడా అరుదైన రీతిలో వాత్సల్యాన్ని కనబరిచారు. ప్రసవానికి రెండు నెలల ముందే ఏడో నెలలోనే జనవరి 18, 1969న సోనియా ఒక మగబిడ్డకు జన్మనిచ్చారు. కానీ, ఆ ఆనందం అంతలోనే ఆవిరయ్యింది. ఆ శిశువు మరణంతో తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆ పసికందును భర్త రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ కలిసి మెహ్రౌలీలోని ఫిరోజ్ గాంధీ ఫామ్‌హౌస్‌లో ఖననం చేసినట్లు ఆమె రాశారు. ఇన్‌క్యుబేటర్‌లో ఉంచినప్పుడు ఆ బిడ్డ తొలి ఏడుపు నాకు వినిపించింది తర్వాత రాజీవ్ నన్ను అతడ్ని చూపించడానికి తీసుకెళ్లారు. నల్లటి ఒత్తైన జుట్టు, పొడవాటి సన్నని వేళ్లతో ముద్దులొలికే ఆ చిన్నారిని చూస్తూ నిలబడ్డాం. రాజీవ్ చెయ్యి నా భుజంపై ఉంది. ఆ క్షణమే మేమంతా ఆ బిడ్డను ప్రాణంగా ప్రేమించాం అని వివరించారు. నెలల నిండక ముందే పుట్టిన ఆ బిడ్డ బతికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని వైద్యులు రాజీవ్‌ను హెచ్చరించారు. కొద్ది గంటల్లోనే ఆ పసికందు కన్నుమూసినట్లు ఆయనకు సమాచారం అందించారు. అమీ ఆంటీ(ఇందిరా గాంధీ స్టాఫ్ సభ్యురాలు అమీ కృష్ణ) తన పక్కనే ఉండగా.. ఉదయం 6:30 గంటలకు ఆ విషాద వార్తను రాజీవ్ నాకు చాలా నెమ్మదిగా చెప్పారు. లేదు... ఇది నిజం కాకూడదు! ఎందుకు ఇలా జరిగింది? అని నేను అడుగుతూనే ఉన్నాను. మేమిద్దరం తీవ్ర దిగ్భ్రాంతికి, తీవ్రమైన గుండెకోతకు గురయ్యాం.. ఒకరినొకరు గట్టిగా పట్టుకుని ఏడ్చేశాం. నేను గుండెలవిసేలా రోదించాను.. భావోద్వేగాలను అణుచుకునే రాజీవ్ సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు అని సోనియా గుర్తు చేసుకున్నారు. ఈ విషయం తెలియగానే పర్యటనలో ఉన్న ఇందిరా గాంధీ మధ్యలోనే ముగించుకుని ఆసుపత్రికి పరుగెత్తుకొచ్చారు. ఆమె కళ్లు ఎర్రబడి, వాచిపోయి ఉన్నాయి. మమ్మల్ని హత్తుకుని చాలా సేపు కూర్చుండిపోయారు.

ఎస్పీజీ భద్రత తొలగింపుపై సోనియా ప్రస్తావన

న్యూఢిల్లీ, నవంబరు 10: రాజీవ్ గాంధీ హత్యకు ఏడాదికి పైగా ముందే ఆయనకు ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) భద్రతను అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం తొలగించిన విషయాన్ని సోనియా గాంధీ ప్రస్తావించారు. 1990 డిసెంబర్‌లో జరిగిన ఓ కమిటీ సమావేశంలో కొత్తగా ఎలాంటి ముప్పు అంచనా లేకపోతే ఎస్పీజీ భద్రత కొనసాగించాలని నిర్ణయించినట్లు ఆమె పేర్కొన్నారు. అయితే ఆ తర్వాత ఎలాంటి రివ్యూ చేయకుండానే మరుసటి నెలలో రాజీవ్ గాంధీ ఎస్పీజీ భద్రతను తొలగించారని పుస్తకంలో రాశారు. రాజీవ్ గాంధీకి అత్యంత సమీపంగా భద్రత కల్పించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన బృందం స్థానంలో స్థానిక పోలీసుల భద్రతను ఏర్పాటు చేశారని ఆమె వివరించారు. రాజీవ్ హత్యకు ముందు భద్రతా ఏర్పాట్లలో జరిగిన మార్పులను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రాజీవ్ హత్య జరిగిన రోజు సాయంత్రం తనకు ఎదురైన పరిస్థితులను గుర్తుచేసుకుని సోనియాగాంధీ చాలా ఎమోషనల్ అయ్యారు. రాజీవ్ గాంధీ ఇంట్లో లేనప్పుడు ఆయన పడుకునే మంచం వైపు ఉండే ఖాళీ తనకు కొంత ఓదార్పునిచ్చేదని పేర్కొన్నారు. మరోవైపు ప్రియాంక తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్లేందుకు రెడీ అవుతుండగా రాహుల్ గాంధీ అమెరికాలోని కాలేజీలో ఉన్నారని తెలిపారు. ఆ సమయంలోనే ప్రియాంక గాంధీ వేగంగా తన గది వైపు వస్తున్న అడుగుల శబ్దం వినిపించిందని సోనియా గాంధీ గుర్తుచేసుకున్నారు. తలుపు తెరిచి లోపలికి వచ్చిన ప్రియాంక ముఖంలో భయం స్పష్టంగా కనిపించిందని.. ఆమె ఊపిరి వేగంగా తీసుకుంటూ తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తాను గుర్తించినట్లు తెలిపారు. రాజీవ్ గాంధీ పర్యటనలో బాంబు పేలుడు జరిగిందని.. పలువురు మరణించారని ఫోన్ చేసి చెప్పినట్లు ప్రియాంక తనకు చెప్పినట్లు సోనియా రాశారు. వెంటనే మద్రాస్‌కు వెళ్లేందుకు సిద్ధం కావాలని కోరిందని పేర్కొన్నారు. మొదట ఆమె చెబుతున్న విషయాలు తనకు అర్థం కాలేదని.అయితే ప్రియాంక గొంతులోని భయం పరిస్థితి తీవ్రతను తెలియజేసిందని వివరించారు. రాజీవ్ గాంధీ మరణవార్త నిజమని పార్టీ సీనియర్ నాయకుడు జార్జ్ ధృవీకరించడంతో తాను పూర్తిగా కుప్పకూలిపోయినట్లు సోనియా పేర్కొన్నారు. రాజీవ్ ఇక లేరని తెలిసిన క్షణంలో తన ప్రపంచమంతా చీకటిలో మునిగిపోయినట్లు అనిపించిందని రాశారు. తాను నిలబడలేని పరిస్థితిలో ఉండటంతో ప్రియాంక తనను పట్టుకుని గదిలోకి తీసుకెళ్లి మంచంపై కూర్చోబెట్టిందని వివరించారు. తండ్రి చనిపోయిన బాధను బయటపెట్టకుండా ప్రియాంక అన్ని ఏర్పాట్ల బాధ్యత తీసుకుందని సోనియా పేర్కొన్నారు. తల్లి మరింత కుంగిపోకుండా జాగ్రత్త పడుతూ అందరికీ ఫోన్లు చేసిందని చెప్పారు. రాజీవ్ పార్థివదేహాన్ని తీసుకొస్తున్న విమానంలోనే తాము వెళ్లాలని పట్టుబట్టిందని.. అనుమతి ఇవ్వకపోతే సొంతంగా ఏర్పాట్లు చేసుకుంటామని స్పష్టంగా చెప్పిందని గుర్తుచేసుకున్నారు. తండ్రి మరణవార్త తెలిసినప్పటికీ ప్రియాంక తన ముందు ఒక్కసారి కూడా ఏడవలేదని బాధను దిగమింగుకుని కుటుంబ బాధ్యతలు నిర్వర్తించిందని సోనియా వివరించారు.

సోనియాపై ధ్వజమెత్తిన విశ్వహిందూ పరిషత్

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన సోనియా: విహెచ్‌పినేత సురేంద్రజైన్



న్యూఢిల్లీ, నవంబరు 10: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై విశ్వ హిందూ పరిషత్ మండిపడింది. సోనియా హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అందుకుగానూ హిందూ సమాజానికి సోనియా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. కాగా, సోనియా గాంధీ రాసిన తన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ మంగళవారం విడుదలైంది. ఈ క్రమంలో అందులో ఉన్న పలు అంశాలపై వీహెచ్‌పీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. హిందువులపై అఘాయిత్యాలు, మారణకాండలు జరుగుతున్నప్పుడు సోనియా మౌనంగా ఉంటారని, కానీ ముస్లింలైన ఉగ్రవాదులు లేదా దురాక్రమణదారులపై చర్యలు తీసుకున్నప్పుడల్లా ఆందోళన వ్యక్తం చేస్తారని ఎద్దేవా చేసింది. ఈ మేరకు వీహెచ్‌పీ కేంద్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ ఓ ప్రకటన విడుదల చేశారు. సోనియా గాంధీ తన ఆత్మకథలో బాబ్రీ మసీదు కూల్చివేతపై కన్నీరు పెట్టుకున్నట్లు పేర్కొనడాన్ని వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ తీవ్రంగా తప్పుపట్టారు. ముస్లిం ఓటర్లను ఆకర్షించేందుకే బాబ్రీ మసీదు కూల్చివేతపై సోనియా విచారం వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో ఆమె కురిపిస్తున్న ఈ విచారం కేవలం మొసలి కన్నీళ్లేనని ఎద్దేవా చేశారు. బాబ్రీ మసీదు కూల్చివేతపై సోనియా ఆవేదన వ్యక్తం చేశారని, కానీ దిల్లీ పేలుళ్లకు కారణమైన ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు విడిచిన పోలీస్ అధికారి మోహన్ శర్మ త్యాగంపై మౌనం వహించారని ఆరోపించారు. ఢిల్లీలో గోవధ వ్యతిరేక ఆందోళన సందర్భంగా సాధువుల హత్య, నిరాయుధులైన కరసేవకుల హత్య గురించి సోనియా విచారం వ్యక్తం చేశారా అని సురేంద్ర జైన్ ప్రశ్నించారు. బస్తర్‌లో నక్సలైట్ల చేతిలో తమ సొంత పార్టీ నాయకులే హత్యకు గురైనప్పుడు ఆమె కన్నీళ్లు కార్చారా పహల్గాంలో హిందూ పర్యటకులను వారి మతం గురించి అడిగి మరీ దారుణంగా హత్య చేసినప్పుడు సోనియా విలపించారా అని ధ్వజమెత్తారు. 1984లో సిక్కులపై జరిగిన దమనకాండకు సోనియా భర్త, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీయే కారణమని ఆరోపించారు. ఈద్ పండగ సమయంలో వాయు నాణ్యత సూచిక పెరగదని కాంగ్రెస్ నాయకులలో ఒకరైన రషీద్ అల్వీ చేసిన వ్యాఖ్యలపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుజరాతీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, నవంబర్ 10: గుజరాతీ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీమంగళవారం గుజరాత్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం, సంపదతో పాటు మంచి ఆరోగ్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా గుజరాతీ భాషలో సందేశాన్ని పోస్టు చేసిన ప్రధాని మోడీ కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, అవకాశాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. "అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ పవిత్రమైన నూతన ఆరంభం మీ అందరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం, శ్రేయస్సు పై కొత్త ఆశలను నింపాలి. మీ జీవితాలు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, ఉత్సాహంతో వెల్లివిరియాలి. ఇవే నా హృదయపూర్వక ఆకాంక్షలు" అని మోడీ పేర్కొన్నారు. బ

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో ఆటోమొబైల్, ఇవి రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యం

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆటోమొబైల్ ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం
25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో హైబ్రిడ్ విధానంలో సమావేశం

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రాన్ని ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాల్లో దేశంలోనే ప్రముఖ పెట్టుబడి గమ్య స్థానంగా తీర్చిదిద్దడంతో పాటు, రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 సన్నాహాల్లో భాగంగా ఆటోమొబైల్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (నిజు) రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం రేపు ఉదయం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి అధ్యక్షతన జరగనుంది. తెలంగాణ సచివాలయంలోని మంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో హైబ్రిడ్ విధానంలో (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) నిర్వహించనున్న ఈ సమావేశానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, పరిశ్రమల నిపుణులు, కీలక భాగస్వాములను ఈ కౌన్సిల్‌లో భాగస్వాము లయ్యేందుకు సంప్రదించగా, సుమారు 25 మంది తమ అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆటో మొబైల్, ఇవి రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతి నిధులతో నేరుగా చర్చించనున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా సంస్థలకు ఉన్న ఆసక్తి, పెట్టుబడి ప్రతిపాదనలు, ప్రస్తు తం కొనసాగుతున్న ప్రాజెక్టులు, పరిశ్రమల విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్తులో అందుబాటులో ఉన్న అభివృద్ధి అవకాశాలపై అభిప్రాయాలు సేకరించనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహ నాల తయారీ, ఇవి ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, బ్యా టరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ, రవాణా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై పారిశ్రా మికవేత్తల సూచనలు, సలహాలను స్వీకరించనున్నారు. ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశ నిర్వహణకు కన్వీ నర్‌గా తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖకు చెందిన లాజిస్టిక్స్, సప్లై చైన్, ఆటోమొబైల్ ఈవీ విభాగం డైరెక్టర్ ఔజాద్ షేక్‌ను నియమించారు. సమావేశ ఏర్పాట్లు, సంబంధిత పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ బాధ్యతలను ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్- 2026కు ముందు నిర్వహిస్తున్న ఈ తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ద్వారా ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను గుర్తించడం, ప్రముఖ పారిశ్రామిక సంస్థలతో ప్రభుత్వ భాగస్వా మ్యాన్ని బలోపేతం చేయడం, తెలంగాణలో కొత్త పరిశ్ర మల ఏర్పాటుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొం దించనున్నారు. ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో ప్రపంచ స్థాయి పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పరిశ్రమల విస్తరణకు తెలంగాణను కీలక కేంద్రంగా నిలబెట్టేదిశగా సమావేశం ముఖ్య ముందడుగుగా నిలవనుంది.



సికింద‌రాబాద్ మ‌హేంద్ర‌హిల్స్‌లో మాతా అమృతానంద‌మ‌యి (అమ్మ)ను ద‌ర్శించుకున్న గ‌వ‌ర్న‌ర్ శివ్‌ప్ర‌తాప్‌శుక్లా, కేంద్ర‌మంత్రి కిష‌న్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్య‌క్షుడు రాంచంద‌ర్‌రావు, ఎంపి ఈట‌ల రాజేంద‌ర్ త‌దిత‌రులు

'అమ్మ'ను దర్శించిన గవర్నర్ శుక్లా
మహేంద్రహిల్స్‌లో వైభవంగా మాతా అమృతానందమయి మఠం రజతోత్సవాలు

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: ప్రేమ, కరుణ, నిస్వార్థ సేవలకు ప్రతిరూపంగా నిలిచిన మాతా అమృతానందమయి (అమ్మ) జీవితం యావత్ సమాజానికి ఆదర్శమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. మానవత్వానికి సేవ చేయడాన్ని మించిన గొప్ప కార్యం మరొకటి లేదని పేర్కొన్నారు. సికింద‌రాబాద్‌లోని ఈస్ట్ మారేడుపల్లిలో మంగళవారం మాతా అమృతానందమయి ఆధ్వర్యంలో మాతా అమృతానందమయి మఠం, అమృత విద్యాలయం రజతోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా మఠం విద్య, వైద్యం, సేవా రంగాల్లో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ నమామి గంగే, స్వచ్ఛభారత్ కార్యక్రమాల కోసం మాత అమృతానందమయి మఠం రూ.100 కోట్ల విరాళంగా అందించిన విషయాన్ని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఐదు దశాబ్దాల్లో దాదాపు నాలుగు కోట్ల మందిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ప్రేమాభిమానాలు పంచిన అమ్మ, వసుధైక కుటుంబకర్త స్ఫూర్తితో ప్రపంచానికి శాంతి, ఐక్యత సందేశాన్ని అందిస్తున్నారని కొనియాడారు.

పేదలకు నాణ్యమైన వైద్యం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, గ్రామాల దత్తత, నిరుపేదలకు పింఛన్లు, వస్త్రాల పంపిణీ వంటి కార్య క్రమాలు మఠం మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు. రాజకీయ నాయ కులు, ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలతో పాటు సమాజ సేవకులుగా కూడా పనిచేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచించేవారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, కరుణ, సామాజిక బాధ్యత, దేశసేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రజతోత్సవం జరుపు కుంటున్న మఠం, విద్యాలయం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అమ్మకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని, ఆమె సేవా సందేశం భావి తరాలకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తూ ప్రసంగం ముగించారు. ఈ సందర్భంగా మాతా అమృతానందమయి రాష్ట్రంలో దత్తత తీసుకున్న గ్రామాలకు చెందిన మహిళలకు మఠం ఆధ్వర్యంలో మాతా అమృతానందమయి, గవర్నర్, కేంద్ర మంత్రి చీరలు, చెక్కులు పంపిణీ చేశారు.



బొల్లారం టిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రులు
మంత్రి దామోదర రాజనర్సింహా బొల్లారం టిమ్స్ ఆస్పత్రి సందర్శన

హైదరాబాద్ (కంటోన్మెంట్), నవంబరు 10, ప్రభాతవార్త: బొల్లారంలో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రిని 2027 జనవరి నుంచి రోగులకు వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు సిద్ధం అవుతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌లు తెలిపారు. మంగళవారం సాయంత్రం బొల్లారం, అల్వాల్ సమీపంలో ఉన్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(టిమ్స్) ఆసుపత్రి నిర్మా ణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునీక వైద్య సదుపాయాల కల్పన,మౌళిక వసతులు,భవిష్యత్తులో రోగులకు అందించనున్న సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతంచేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

నిజామాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో కొత్వాల్ నేర సమీక్షా సమావేశం
జిల్లాలో 25 నుంచి 28 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడల ముగింపుపై దిశానిర్దేశం

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య మంగళవారం నాడు క్రైం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అనేక అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 25 నుం డి 28 వరకు జిల్లాలో జరుగబోయే రాష్ట్ర స్థాయి క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు చేబట్టాల్సిన చర్యల గురించి వివరించారు. జి ల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని, మనుషుల అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పిడి చట్టం నమోదు చేయాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని ఆయన కోరారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు వుంచే వారిపై నిరంతరం నిఘా వుంచి అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని. విద్యాసంస్థలు, బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని ఆయన సూచించారు. పేకాట, గుట్కా, ఇసుక ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిం చాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. రిసెప్షన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశు భ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రో డ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశం లో నిజామాబాద్ డివిజన్ ఎసిపి ప్రకాష్ యాదవ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న గద్వాల విజయలక్ష్మి.

సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 103
ఇద్దరికి రూ. 5.50 లక్షల ఎల్ఓసి అందజేసిన గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 10, ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 268వ సీఎం ప్రజావాణి ఈ కార్యక్రమంలో 103 దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్షి ్మ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించారు. అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కార్తిక్ కు రూ. మూడు లక్షలు, మిథ్యాకు రూ. రెండున్నర లక్షల సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్‌లను గద్వాల్ విజయలక్షి ్మ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 29, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖకు 08, మున్సిపల్ శాఖకు 18, ఇతర శాఖలకు 48 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధి కారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందెశ్రీ సాహిత్యం భావితరాలకు స్ఫూర్తి
ఆయన ఆశయాలు, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి: మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ (రవీంద్రభారతి), నవంబరు 10, ప్రభాతవార్త: అందెశ్రీ సేవలు, పాటలు, సాహిత్య రచనలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి భావితరాలకు ఎంతో స్ఫూర్తినిస్తాయన్న తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయన లేనిలోటు తెలంగాణ సమాజానికి, సాహిత్యానికి ఎవ్వరూ పూడ్చలేనిదని, ఆయన ఆశయాలు, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వ ర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వ హించిన అందెశ్రీ ప్రథమ వర్ధంతి, సంస్మరణ సభ కు ముఖ్యఅతిథిగా హాజ రైన మంత్రి జూపల్లి కృష్ణా రావు విశిష్ట అతి థులు తెలంగాణ సాంస్కృ తిక సారథి అధ్యక్షురాలు జి.వి. వెన్నెల, అరుణో దయ అధ్యక్షురాలు విమలక్క, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు చరణ్ కౌశిక్‌యాదవ్ తదిత రులతో కలిసి అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళుల ర్పించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో తన రచనలు, పాటలతో తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమ స్ఫూర్తిని నింపిన ప్రజాకవి అని కొని యాడారు. ప్రత్యేక తెలం గాణ రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై హోరెత్తించిందని గుర్తుచేశారు. తన కలం, గళం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని, పాటలు తూటాల్లా ఉద్యమానికి కొత్త ఊపిరి పోశాయన్నారు.

తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేయడం కీలకపాత్ర పోషించాయని స్పష్టం చేశారు. అందెశ్రీ ఆలోచన, ఆశయాలను కవులు, కళాకారులు, సాహితీవేత్తలు కొనసాగించాలని జూపల్లి పిలుపు నిచ్చారు. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలన్న ఆయన ఆకాంక్షను మన జీవనవిధానం, ఆలోచనా విధానంలో భాగం చేసుకుని ముందుకుసాగితేనే అందెశ్రీని మనమర్పించే ఆందెశ్రీకి నిజమైన నివాళి అర్పించిన వారమౌతామని కృష్ణారావు పునరుద్ఘా టించారు. డా. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షోపన్యాసంలో అందెశ్రీ సాహిత్య ప్రస్థానం, కవిత్వంలోని సామాజిక చైతన్యం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలు, పోషించిపాత్ర, ప్రజల జీవితాలతో ఆయన రచనలకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సభకుముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అందెశ్రీ రచించిన పలుగీతాలను ఆలపించి సంగీత నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా అందెశ్రీపై రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు.



అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి, ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

రూఫ్‌టాప్ సోలార్‌కు బీమా కవరేజీ
మార్చిలో సూర్య ఘర్ 2వ దశ ప్రారంభం
నాలుగు నెలలపాటు పాడిగించే ఆలోచన
పునరుత్పాదక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుబ్రమణ్యం

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: పునరుత్పాదక ఇంధన వనరులను అభివృద్ధి చేసే దిశగా అమలు చేస్తున్న పిఎం సూర్య ఘర్ సమృద్ధి యోజన పథకం కింద ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లకు సంబంధించి బీమా రక్షణ కల్పించే దిశగా కేంద్రం కీలక నిర్ణ యం తీసుకుంది. నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి జెవి ఎన్ సుబ్రమణ్యం న్యూఢిల్లీలో మంగళవారం మీడి యాతో మాట్లాడుతూ చిన్న తరహా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు బ్యాంకులు మంజూరు చేసే రుణాలకు బీమా సదుపాయం కల్పించేందుకు సం బంధిత బీమా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పీఎం సూర్య ఘర్ రూఫ్‌టాప్ సోలార్ పథకం యొక్క రెండవ దశను ప్రారంభించడానికి కేంద్రం సిద్ధమవుతోందన్నారు. దేశంలోని వికేంద్రీకృత పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ప్రస్తుత పరిశ్రమ చర్చల నుండి వెలువడే ఫలితాలు, వచ్చే ఏడాది మార్చిలో బహుశా ప్రారంభమయ్యే పీఎం సూర్య ఘర్ రెండవ దశ విధాన పత్రాన్ని రూపొం దించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని మూడు నుంచి నాలుగు నెలలపాటు పొడిగించాలని ప్రభుత్వం యోచిస్తోందని, అదే సమయంలో దాని తదుపరి కార్యక్రమంపై సంప్రదింపులు జరుగు తున్నాయని తెలిపారు. ఈ సౌర ప్రాజెక్టులకు విశ్వసనీయమైన రుణం లభించేలా చూసేందుకు, మంత్రిత్వ శాఖ ఆస్తుల లాభదాయకత అనే కీలక సమస్యను పరిష్కరిస్తోందని చెప్పారు. ఈ వ్యక్తి గత ఆస్తులను ఏకీకృతం చేయకుండా, ఒక ప్రామా ణిక మూడు కిలోవాట్ల నివాస రూఫ్ సిస్టమ్‌కు అయ్యే ప్రత్యేక బీమా ఖర్చు గణనీయంగా ఎక్కువగా ఉంటుందని దీన్ని దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ ఫార్మ్ సోలార్ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాలు భారీ స్థాయిలో సామర్థ్య పెంపును విజయవంతంగా ప్రేరేపించినప్పటికీ, ఐఆర్ఈడీఏ వంటి ఫైనాన్షియర్ల నుండి మరింత మూలధనాన్ని పొందాలంటే కఠినమైన విధాన సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ఆర్థిక ప్రమాద అంచనాలను ప్రామాణీకరించడానికి విధాన రూపకర్తలు, పంపిణీ సంస్థలు. బ్యాంకర్లకు వికేంద్రీకృత పునరుత్పాదక ఆస్తికి సంబంధించి ఏకీకృత నిర్వచనం అత్యవసరంగా అవసరమని పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుబ్రమణ్యం నొక్కి చెప్పారు.

ఒబిసిలకు రాజకీయ ప్రాతినిధ్యంపై రాహుల్‌తో చర్చించా
మన్మోహన్‌సింగ్ మెమోరియల్ పార్కు పుస్తకాన్ని అందించిన మహేశ్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు10, ప్రభాతవార్త: మన్మో హన్‌సింగ్ మెమోరియల్ పార్కు పుస్తకాన్ని రాహుల్‌కు మహేశ్‌గౌడ్ అందించారు. రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మన్మోహన్ స్మారకార్థం పార్కు నిర్మించారు. ఢిల్లీలోని జన్‌పథ్‌లో రాహుల్‌గాంధీకి మహేశ్‌గౌడ్ పుస్తకం అందజేశారు. దేశవ్యాప్తంగా, తెలం గాణలో ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో చర్చించినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈరోజు రాహుల్‌తో సమావేశమైన పీసీసీ చీఫ్.. భారత్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... వెనుకబడిన తరగతులకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని రాహుల్‌కు వివరించినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలను వివరించానన్నారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చ జరిగిందని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగే భారత్ సమ్మిట్‌కు రాహుల్ వస్తున్నట్లు మహేశ్ కుమార్ తెలిపారు. భారత్ సమ్మిట్‌తో పాటు గిగ్ వర్కర్ల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాహుల్‌గాంధీ సూచించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో వారితో సమావేశం నిర్వ హించాలని రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకున్నారని తెలి పారు. తెలం గాణలో మెగా బీసీ ర్యాలీ నిర్వహణకు ఆహ్వా నించానని తెలిపారు. నవంబర్ చివరినాటికి తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తవుతుందని స్పష్టం చేశారు. సోనియాగాంధీ జీవిత విశేషాలతో వెలువడిన పుస్తకాన్ని మహేశ్ కుమార్‌గౌడ్ స్వాగతించారు. సోనియాగాంధీ, రాజీవ్‌గాంధీ అనుబంధం, భార తీయ సంప్రదాయాలను స్వీకరించిన అంశాలను పుస్తకంలో ప్రస్తావిం చారన్నారు. సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకంపై తెలంగాణలో కూడా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.



మంగళవారం ఢిల్లీలోని జన్‌పథ్‌లో రాహుల్ గాంధీకి పుస్తకం అందజేసిన మహేశ్‌గౌడ్

బాయిలర్ల సర్టిఫికెట్ల గడువు మరో 3 నెలలు పొడిగింపు
నిర్వహణపై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: రాష్ట్రంలో బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాయిలర్ల సర్టిఫికెట్ల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 465 జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించింది. దీంతో ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలి పింది. 100 టన్నులు, అంతకంటే ఎక్కువ సామర్థం ఉన్న బాయిలర్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని పేర్కొంది.

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యుత్ కేంద్రాలు, చమురు, గ్యాస్ పరిశ్రమలకు ఊరట కలిగిస్తుంది. అలాగే పెట్రోలియం రిఫైనరీలు, పెట్రో కెమికల్‌తోపాటు ఎరువుల పరిశ్రమలకు వెసులుబాటు కల్పిస్తుంది. 2026, నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ అమలు కానుంది. సర్టిఫికెట్ గడువు ముగిసే బాయిలర్లకు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు మాత్రం తప్పనిసరి అని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

గోల్కొండ పోలీసుస్టేషన్‌లో ఒకరి నిర్బంధం
పోలీసుల దాడిపై హెచ్ఆర్‌సి సీరియస్
నివేదిక ఇవ్వాలని కొత్వాల్‌కు ఆదేశం
భూభారతి ఆపరేటర్ల వేతనాలను చెల్లించాలని రెవెన్యూ శాఖకు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: గోల్కొండ పోలీసులు ఓ వ్యక్తిని అక్రమంగా నిర్బంధించడంతో పాటు అతన్ని అకారణంగా కొట్టడం పై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై వెంటనే విచారణ జరపాలని, దీనికి బాధ్యులైన పోలీసులను గుర్తించి చర్యలు తీసుకోవాలని హెచ్ఆర్‌సి సిటీ పోలీసు కమిషనర్ సజ్జనార్‌ను ఆదేశించింది. దీనిపై ఆరు నెలల వ్యవధిలో తమకు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. దీంతోపాటు రెవెన్యూ శాఖపై కూడా హెచ్ఆర్‌సి ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఏడు నెలలుగా నిలిచిపోయిన భూభారతి ఆపరేటర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది.

పంట రుణాల పునఃప్రణాళిక
కరవును ఎదుర్కొనేలా బ్యాంకర్ల ప్లాన్
పంట నష్టాల సర్వేలో వ్యవసాయ శాఖ
33 శాతం దెబ్బతిన్న పంట వివరాల సేకరణ
సంక్షోభంలో ఉన్న రైతాంగానికి సర్కార్ బాసట

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: కరవు సంక్షో భంలో ఉన్న రైతులకు విశ్వాసాన్ని కలిగించి, ప్రస్తుత పరిస్థితులను అధిగమించేలా చేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఎల్ నినో ప్రభావం కారణంగా కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న రైతులకు వెన్నుదన్నుగా నిలిచేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సర్కార్ ఆదేశాల మేరకు పంట రుణాలను పునఃప్రణాళికకు రూపకల్పన చేసే దిశగా బ్యాంకులు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా 2026-27 వార్షిక రుణ ప్రణాళికలో మార్పులు చేసి కరువులో కొట్టుమిట్టాడుతున్న రైతులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రుణ ప్రణాళికలో మార్పులు, చేర్పులు చేయాలని బ్యాంకులు నిర్ణయించాయి. రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సహకారంతో పంట రుణాల రీషెడ్యూల్‌కు చర్యలు తీసుకోనున్నాయి. పాత రుణాలను వాయిదా వేసి, మళ్లీ కొత్తగా రుణ సదుప



సదర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన కర్ణాటక గవర్నర్ సుధాయాదవ్‌కు స్వాగతం పలికిన యాదవ్ సమాజం ప్రతినిధులు

సదర్ ఉత్సవాలు యాదవ సమాజ ఆత్మగౌరవ ప్రతీక

కర్ణాటక గవర్నర్ సుధాయాదవ్ కిషన్‌రెడ్డి ఆహ్వానంతో ఉత్సవాలకు హాజరు

అలంకరించిన దున్నపోతులు, డప్పు చప్పుళ్లతో మారుమోగిన వైఎంసిఎ

హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త: 'నారాయణగూడ సదర్ అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదు.. అది యాదవ సమాజం ఆత్మగౌరవానికి ప్రతీక' అని కర్ణాటక గవర్నర్ శ్రీమతి సుధా యాదవ్ అన్నారు. 1946 నుంచి ఈ సంప్రదాయాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుండటం ఎంతో గర్వకారణమని ఆమె కొనియాడారు. చారిత్రక నారాయణగూడ వై ఎం సి ఏ వద్ద మంగళవారం రాత్రి యాదవ సమాజం నిర్వహించిన పెద్ద సదర్ ఉత్సవాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ "నా పుట్టుక కూడా యాదవ కుటుంబంలోనే జరిగింది. ఈ రోజు కర్ణాటక గవర్నర్ గా కంటే, ఒక యాదవ బిడ్డగా ఈ సదర్ లో పాల్గొనడం నాకు ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చింది. ఈ వేదికపై నిలబడి మాట్లాడటాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను. నన్ను ఇక్కడికి ఆహ్వానించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు.దున్నపోతులను పూజించడమంటే మన పశుసంపదను, రైతును, భారతీయ సంస్కృతిని గౌరవించడమేనని గవర్నర్ పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో గోసంరక్షణ, పశుసంరక్షణ చేపట్టడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. తెలంగాణ యాదవ సమాజం దేశానికి ఎంతో మంది వీరులను, నాయకులను అందించిందని, యువత ఈ గొప్ప సంప్రదాయాన్ని, సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షి ంచారు.

ప్రాంగణంలో పండుగ వాతావరణం

మంగళవారం బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్, అక్కడి నుంచి తెలంగాణ లోక్ భవన్ కు వెళ్లారు. అనంతరం రాత్రి పది గంటలకు నారాయణగూడ సదర్ ప్రాంగణానికి చేరుకు న్నారు. గవర్నర్ రాకతో వైఎంసిఏ ప్రాంగణం అంతా సుందరంగా అలం కరించిన దున్నపోతులు, డప్పు చప్పుళ్లు, యాదవ బ్యాండ్ మేళా లతో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో యా దవ సంఘాలప్రతినిధులు, ప్రముఖులు, పెద్దసంఖ్యలోప్రజలు పాల్గొన్నారు.



నారాయణగూడలో సదర్ సమ్మేళన ఉత్సవం

ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్‌పై నెతన్యాహు ఒత్తిడి?

వాషింగ్టన్, నవంబరు 10: ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు ప్రారంభించాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం నెతన్యాహు ప్రతిరోజూ ట్రంప్‌కు ఫోన్ చేస్తున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు ట్రంప్ వివిధ మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించాలని నెతన్యాహు ప్రతిరోజూ ఆయనకు ఫోన్ చేస్తున్నారు. అయితే వైట్‌హౌస్‌లోనూ, బయటా యుద్ధం వద్దని భావిస్తున్న వారు ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చర్చల గురించి తెలిసిన ఓ వ్యక్తి ఫైనాన్షియల్ టైమ్స్‌కు వెల్లడించారు. ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్యలు చేపట్టాలని నెతన్యాహు కోరుకుంటున్నప్పటికీ, ప్రస్తుతం ట్రంప్‌ను ఒప్పించేందుకు ప్రత్యేకంగా ఎలాంటి ఒత్తిడి లేదా ప్రయత్నాలు కొనసాగడం లేదని ఇజ్రాయెల్ పరిస్థితులపై అవగాహన ఉన్న మరో వ్యక్తి పేర్కొన్నారు. మరోవైపు, ఎని మిది నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని మధ్యప్రాచ్య దేశాల నేతలు ట్రంప్‌పై ఒత్తిడి తెస్తున్నారు.సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్‌సల్మాన్,యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ, టర్కీ అధ్యక్షుడు రెసెప్‌తయ్యిప్ ఎర్డోగాన్‌లు ట్రంప్‌తో మాట్లాడినట్లు సమాచారం.

తెలంగాణ నీటి వాటాపై సుప్రీంలో వాదనలు వినిపించండి

కృష్ణా జలాల్లో రాష్ట్రం న్యాయమైన వాటా సాధించాలి : అధికారులతో సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త: కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏపీతో వివాదం ఉన్న అన్ని అంశాలపై అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి న్యాయ నిపుణులతో చర్చించారు.

మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఇంజనీర్లను ఆదేశించారు.ఇప్పటికే నిర్ణయించిన ప్రకారం ఏడుల నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఈ రెండు పథకాలకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లపూర్ నుంచి ఏడుల వరకు తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడ టన్నెల్, ఎక్కడ కాలువ అవసరమో గుర్తించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరిం చారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి ఉన్నందున అదనపు టీఎంసీ పనుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించి, భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.



మంగళవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో సిఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

విద్యా సంస్థల్లో సినిమా ప్రమోషన్ల నిషేధంపై ప్రభుత్వం కసరత్తు

హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన విద్యా సంస్థలు ఇటీవల కట్టుతప్పుతున్నాయి. తమ పిల్లలు భవిష్యత్ కోసం రూ.లక్షలు పోసి తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిస్తున్నారు. కానీ కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను తమ రాజకీయ, కుటుంబ అవసరాల కోసం వినియోగించు కుంటున్నాయి.

ఈ క్రమంలో అనేక అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడమే కాకుండా కొన్ని సార్లు విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యా సంస్థల్లో సినిమా, ఇతర ప్రైవేటు కార్యక్రమాల ప్రమోషన్లపై నిషేధం విధించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవల కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న పరిణామాలు ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, విద్యావంతుల్లో ఆందోళన నెలకొంది. విద్యా సంస్థల యాజమాన్యాలు ఇష్టారీతిగా సెలవులు ప్రకటించడం, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండానే భారీ కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం తల్లిదండ్రులను తీవ్రంగా కలవరపరుస్తోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో విద్యా సంస్థలు చట్ట పరంగా వారి క్యాంపస్‌లలో ఎలాంటి కార్య క్రమాలు చేపట్టవచ్చు, ఎటువంటివి నిర్వహించ కూడదనే అంశంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ప్రభుత్వ పెద్దలు విద్యా శాఖాధికా రులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ యోచన ప్రకారం... ప్రాథమికంగా, విద్యా సంస్థల ప్రాంగణాలను విద్యా, క్రీడా కార్యక్రమాలకు మినహా సినిమా, ఇతర వాణిజ్య కార్యక్రమాలకు వినియోగించకూడదు. విద్యా, క్రీడా కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహిస్తే, ఎంత మంది హాజరవు తారు, స్టేజీ నిర్మాణం, రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ తదితర వివరాలను ముందుగానే స్థానిక విద్యా శాఖ అధికారులు/పోలీసులకు అందజేయాలి. క్రీడా, సాంస్కృతిక, కళా రంగానికి సంబంధించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే, ప్రోత్సహించే చిన్న కార్యక్రమాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదు.

ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు

త్వరలోనే విద్యా సంస్థలకు మార్గదర్శకాలు విడుదల

వందలాది మందితో నిర్వహించే వాటి విషయంలో మాత్రం విద్యా సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి. ఉద్యోగాల కల్పన, స్టార్టప్స్, ఆవిష్కరణల్లో తెలంగాణ విద్యార్థులు గొప్ప ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, గూగుల్ ఫర్ స్టార్టప్స్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్ వంటివి చేపట్టింది. కళలు, సంస్కృతి, సృజనాత్మకతకు సంబంధించి గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానం, యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ వంటి కార్యక్రమాలు నిర్వహించింది.ఇదే సమయంలో కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు అందుకు భిన్నంగా తాము సూచించిన సినిమాలు చూడాలని, ఆ సినిమా చూసేందుకు సెలవులు సైతం ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది.

ఇటీవల ఒక విద్యా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో స్టేజీ కూలి విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలువురు విద్యార్థులు గాయపడ్డారు.ఈ నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో విద్యా సంస్థలకు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లపై రాహుల్ గాంధీ వ్యాఖ్యం

హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల జీవితాల్లో వెలుగులు నింపారంటూ రేవంత్ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రశంసల జల్లు కురిపించారు. దీపావళి సందర్భంగా షాద్ నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇంట్లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పండుగ వేడుకలు చేసుకున్నారు.

అందుకు సంబంధించిన వీడియోను ఎంపీ రాహుల్‌గాంధీకి టీ పీసీసీ చీఫ్ చూపించారు. అనంతరం తెలంగాణలో రేవంత్ సర్కార్ చేపట్టిన పథకాలపై ఎంపీ రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆనందం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అలాగే సన్న బియ్యం, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తదితర పథకాలను ఎంపీ రాహుల్ గాంధీ మెచ్చుకున్నారు.

దేశం గర్వించేలా ఖేలో ఇండియా



ఖేలో ఇండియా నిర్వహణపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

అధికారులకు మంత్రి శ్రీహరి కీలక ఆదేశాలు

హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త:రాష్ట్రంలో ఖేలో ఇండియా నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దేశం గర్వించేలా ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతోనే తెలంగాణలో ఖేలో ఇండియా నిర్వహించేందుకు అవకాశం వచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. ఈ విషయంలో డిప్యూటీ కలెక్టర్లకు పూర్తి అధికా రాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. అనవసర ఖర్చులు వద్దని.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించాలని మంత్రి చెప్పుకొచ్చారు. నేటి యువత రీల్స్, సోషల్ మీడియాను ఫ్యాషన్‌గా ఎంచుకుంటున్నారని, యువత క్రీడల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. మణిపూర్ రాష్ట్రంలో గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడా సంస్కృతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలోని ప్రతి గ్రామంలో క్రీడా వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాలని తెలి పారు.

రూ.203 కోట్లతో ఖేలో ఇండియా నిర్వహణకు ఏర్పాట్లు: ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వాణీప్రసాద్

"ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన క్రీడా వేదికలను సిద్ధం చేస్తున్నామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కోచ్‌లు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.ఖేలో ఇండియా నిర్వహణ కోసం మొత్తం రూ.203 కోట్లతో ఏర్పాట్లు చేపడుతున్నామని, ఇందులో రూ.120 కోట్లను క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేటాయించి పనులు చేపడుతున్నామని వివరించారు.పనుల అమలులో స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగేందుకు డిప్యూటీ కలెక్టర్లకు లిస్ట్ ఆఫ్ వర్క్స్, లిస్ట్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ విధానాన్ని అనుసరించాలని ఆదేశిస్తున్నామని తెలిపారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ అండ్ ఎండీ సోనిబాలాదేవి, వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు విజయసాయి కొత్త పార్టీ

66 శాతం యువతకు ప్రాధాన్యమని వెల్లడి

విశాఖపట్నం, నవంబరు 10, ప్రభాతవార్త: రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడమే లక్ష్యంగా మాజీ రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి నూతన రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్లో పార్టీని అధికారికంగా ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో తన సన్నిహితులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పార్టీ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక విషయాలను వెల్లడించారు. రాష్ట్ర రాజకీయాలు రెండు కుటుంబ పార్టీల చుట్టూనే తిరుగుతున్నాయని, ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం అవసరమని విజయసాయిరెడ్డి అభిప్రాయవడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల పేరుతో ప్రజలను విభజిస్తూ, సంక్షేమ పథకాల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భారం పెరుగుతోందని, భవిష్యత్ తరాలకు అప్పుల కుప్పలు మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.యువతకు 66 శాతం ...తన కొత్త పార్టీలో 25 నుంచి 40 ఏళ్లలోపు యువతకు 66 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రకటించారు. సమర్థులైన సామాన్యులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడమే తన ప్రధాన ఉద్దేశమన్నారు. తాను కానీ, తన కుటుంబ సభ్యులు కానీ ముఖ్యమంత్రి పదవిని ఆశించడం లేదని, కేవలం మార్గదర్శిగా మాత్రమే వ్యవహరిస్తానని స్పష్టం చేశారు.

గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో కర్ణాటక గవర్నర్ సుధాయాదవ్ భేటీ



హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త: కర్ణాటక రాష్ట్ర గవర్నర్ డాక్టర్ సుధా యాదవ్ మంగళవారం లోక్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు గవర్నర్లు పలు అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు.

రాహుల్‌గాంధీ పొలిటికల్ రీలాంచ్‌కు తెలంగాణ అడ్డా కాదు

రేవంత్ రెడ్డి సర్కార్‌పై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆగ్రహం

హైదరాబాద్,నవంబరు10,ప్రభాతవార్త: తెలంగాణ ప్రజల సొమ్ముతో రాహుల్ గాంధీని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ మీద నిలబెట్టేందుకు తాపత్రయపడుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నిసార్లు ఫెయిలైనా రాహుల్ గాంధీని మళ్లీ రీలాంచ్ చేయడానికి తెలంగాణను ప్రయోగశాలగా మార్చడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ పన్ను చెల్లింపుదారుల పైసలతో పొలిటికల్‌గా ఫెయిలైన రాహుల్ గాంధీ రాజకీయ ఉనికిని బతికించడానికి కాంగ్రెస్ పడుతున్న ఆరాటం తప్ప ఇందులో మరొకటి లేదన్నారు. ఒకపక్క రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయింది, పెండింగ్ బిల్లులు కట్టడానికి, ఇచ్చిన హామీలు అమలు చేయడానికి రూపాయి లేదంటారు. మరి రాహుల్ గాంధీ ఆర్భాటాల కోసం ఖజానా తలుపులు ఎలా తెరుచుకుంటున్నాయి? తెలంగాణ ప్రజల కష్టార్జితం ప్రజల సంక్షేమం కోసమా? లేక గాంధీ కుటుంబానికి రాజకీయ పునరావాసం కల్పించడానికా? అని రాంచందర్ రావు ప్రశ్నించారు.

లోన్ యాప్ రుణం రికవరీ ఏజెంట్ల వేధింపులతో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్ (సరూర్‌నగర్), నవంబరు 10, ప్రభాతవార్త: లోన్ యాప్ ద్వారా తీసుకున్న రుణం ఆ కానిస్టేబుల్ పాలిట మృత్యువైంది. రుణాన్ని చెల్లించాలనీ లేని పక్షంలో మార్పింగ్ చేసిన నగ్న చిత్రాలతో పరువు తీస్తామని రికవరీ ఏజెంట్ల చేసిన వేధింపులు భరించలేక బాధి తుడు బలవర్మరణానికి పాల్ప డ్డాడు. ఈ సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పహాడీషరీఫ్ పిఎస్ పరిధిలోని హర్షగూడ గ్రామానికి చెందిన ముడావత్ శ్రీను (31) కొండాపూర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం వివాహమైన అతడు నాలుగు నెలల క్రితం ఓ లోన్ యాప్ ద్వారా రూ.40 వేలు అప్పు తీసుకున్నాడు. అయితే నిర్ణీత సమయం లోగా రుణం చెల్లించకపోవడం శ్రీనుకు యాప్ లోన్ రికవరీ ఏజెంట్ల నుండి ఒత్తిడి మొదలైంది. ఈ క్రమంలో వేధింపులుగా మారాయి. అయితే దీపావళి పండుగ ఉండడంతో శ్రీను స్వగ్రామానికి రాగా యాప్ నిర్వాహకులు ఫోన్ల మీద ఫోన్లు చేస్తూ డబ్బుల కోసం వేధించారు. అంతే కాకుండా మార్పింగ్ చేసిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తామంటూ బెదిరించారు. దీంతో తీవ్ర ఒత్తిడికి, మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెందిన శ్రీను తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో పహాడీషరీఫ్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసును నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ముడావత్ శ్రీను (ఫైల్)

శాంతి భద్రతల దిశ డిఎస్పీల చేతుల్లోనే

>> చేశారు. పదిమంది డిఎస్పీలు అరాచకంగా,ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన బాగోలేదనే ఆరోపణలు వస్తాయి. ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతుంది. శాంతిభద్రతలు క్షీణించి,అవినీతి పెరిగిందనే ఆరోపణలు రావొచ్చు. అదే పది మంది సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది' అని పేర్కొన్నారు. సంక్లిష్టమైన పరిస్థితుల్లో డిఎస్పీల నియామకం చేపట్టామని వివరించారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసిందని పేర్కొన్నారు. 2011లో గ్రూప్1 నియామకాలు చేపట్టారని.. ఆ తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లు తెలంగాణలో గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదని గుర్తు చేశారు. కొన్ని నెలలు ఆలస్యమైతేనే ఏళ్ల కోల్పోయామనే బాధ కలుగుతుందని అన్నారు. టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చినా.. ప్రశ్నాపత్రాలు, ఇతర అంశాల్లో జరిగిన గందరగోళం అందరికీ తెలుసునని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మీరు ఆ రోజు బాధితులు.. ఆనాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, నిరక్ష్యం చాలా మందికి కష్టనష్టాలు మిగిల్చిందని తెలిపారు. తాను ముఖ్యమంత్రి కాగానే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించానని గుర్తు చేసుకున్నారు. గతంలో టీజీపీఎస్సీలో సభ్యులుగా పనిచేసిన వారిలో ఆర్ఎంపీ డాక్టర్లు లాంటి వాళ్లు కూడా ఉన్నారని వివరించారు.రాజకీయ పునరావాస కేంద్రంగా టీజీపీఎస్సీ తయారైందని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అవగాహన లేని వాళ్లను సభ్యులుగా నియమించడమే ప్రభుత్వం చేసిన తప్పు అని పేర్కొన్నారు. యూపీఎస్సీ చేపట్టిన విధి విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని ఆ తరహాలో రూపొందించామని అన్నారు. అందుకోసం యూపీఎస్సీకి స్వయంగా వెళ్లి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. టీజీపీఎస్సీ మొదటి చైర్మన్‌గా రిటైర్డ్ డీజీపీ మహేందర్ రెడ్డిని నియమించామని వివరించారు. పోటీ పరీక్షలు నిర్వహించడంలో అనుభవం కలిగిన వాళ్లను, చిత్తశుద్ధి ఉన్నవాళ్లను బోర్డు సభ్యులుగా నియమించామని సోదాహరణగా వివరించారు. 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది జాయిన్ అయ్యారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 112 మంది డీఎస్పీల నియామకం చాలా పెద్ద విషయమని అన్నారు. నియామకాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో పారదర్శకత పాటించిందని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఉన్నారంటే తమ ప్రభుత్వ పారదర్శకత అర్థమవుతుందని తెలిపారు. ఈ నియామకాలపై కొందరు పని గట్టుకుని ఎన్నో ఆరోపణలు చేశారని మండిపడ్డారు. అయితే తమకు రాజకీయ ఆరోపణలు కొత్త కాదని.. కానీ మీకు ఇది చాలా ఆందోళన కలిగించిందని చెప్పారు. ఈ అవకాశం కూడా జారిపోతుందేమోనని ఆందోళన చెందారని అన్నారు. డీఎస్పీల తరఫున సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లిందని వివరించారు. నిష్ణాతులైన న్యాయవాదులతో వాదించి డీఎస్పీల నియామకాన్ని సాధించామని గుర్తు చేశారు.నాలెడ్జ్, చిత్తశుద్ధి, అంకితభావం మీ అందరినీ ఇక్కడ కూర్చోబెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దని శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు ఆయన హితవు పలికారు. మన నేపథ్యాన్ని మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమన్నారు. మీరు ఏ ఉద్దేశంతో పోలీస్ శాఖలో చేరారో దాన్ని మరిచిపోవద్దని స్పష్టం చేశారు.

లక్ష్యం పెట్టుకుని కష్టపడ్డారు కాబట్టే ఈ హోదాకు చేరుకున్నారని శిక్షణ డీఎస్పీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇక ముందు రెండో అధ్యాయం ప్రారంభం కాబోతుంది.. ఇది మీ జీవితాల్లో చాలా ముఖ్యమని తెలిపారు. వచ్చే ముప్పై ఏళ్లు తెలంగాణ భవిష్యత్తును ఏ దిశగా నడిపించాలో అది మీ చేతుల్లోనే ఉందని వారికి సీఎం రేవంత్ సూచించారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు

యూత్ ఒలింపిక్స్‌లో షూట్‌ఆఫ్‌లో ఓడిన గాథా



డాకర్: యూత్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి చెందిన ఏకైక ఆర్చర్ అయిన గాథా ఖడకే డాకర్‌లోని అబ్దులయే వాడే స్టేడియంలో జరిగిన హోరాహోరీ క్వార్టర్ ఫైనల్‌లో అమెరికాకు చెందిన ఆరో సీడ్ యూయున్ వాంగ్‌తో షూట్‌ఆఫ్‌లో ఓడిపోయి, మహిళల వ్యక్తిగత రికర్వ్ అండర్18 పోటీల నుండి నిష్క్రమించింది. ఐదు సెట్ల హోరాహోరీ పోరు 5-5తో ముగిసిన తర్వాత, ఇద్దరు విలుకాళ్ళు తొమ్మిది పాయింట్లు సాధించినప్పటికీ, గాథ 5-6 (9-9) తేడాతో ఓడిపోయింది. అయితే, ఆమె బాణం లక్ష్యం మధ్య భాగానికి దగ్గరగా వెళ్లడంతో వాంగ్ విజయం సాధించింది. మూడో సీడ్ గాథా అద్భుతంగా ప్రారంభించి, తొలి సెట్‌ను 29-27 తేడాతో గెలుచుకుని 2-0 ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత రెండు ఎనిమిది స్కోర్లు సాధించడంతో, వాంగ్ స్కోరును సమం చేసి ఆమె రెండో సెట్‌ను 25-29 తేడాతో కోల్పోయింది. మూడవ సెట్‌లో గాథ బలంగా పుంజుకుని, తన ప్రత్యర్థి సాధించిన 25 పాయింట్లకు గాను 29 పాయింట్లు సాధించి 4-2తో తిరిగి ఆధిక్యాన్ని సంపాదించింది. వాంగ్ తన 27 పాయింట్ల ప్రదర్శనలో 10 షాట్లు సాధించి, 26 పాయింట్లు సాధించిన గాథాను అధిగమించి, స్కోర్లను 4-4తో సమం చేయడంతో నాలుగో సెట్ కీలకంగా మారింది. ఐదవ సెట్‌లో ఇద్దరు ఆర్చర్లు 28 పాయింట్లు సాధించడంతో, పోటీ 5-5తో సమంగా నిలిచి షూట్‌ఆఫ్‌కు దారితీసింది. ఒకే బాణంతో జరిగిన ట్రైబ్రేకర్‌లో, ఇద్దరూ తొమ్మిది పాయింట్లు సాధించారు. కానీ వాంగ్ తన బాణం లక్ష్యం మధ్య భాగానికి దగ్గరగా వేయడంతో స్వల్ప ఆధిక్యం సాధించింది. అంతకుముందు, గాథా బల్గేరియాకు చెందిన నెడా కెండరోవాపై 6-0 తేడాతో స్ట్రెయిట్ సెట్లలో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది.

కుమామోటో మాస్టర్స్.. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు గాయత్రి-ట్రీసా



కుమామోటో: మంగళవారం ఇక్కడ జరిగిన కుమామోటో మాస్టర్స్ జపాన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభ రౌండ్‌లో, భారత మహిళల డబుల్స్ జోడీ గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీలు స్వదేశీ అభిమానులైన హినాటా సుజుకి, నావో యమకితలపై వరుస గేమ్‌లలో విజయం సాధించి ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగిన బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుచుకున్న ఈ భారత జట్టు, రౌండ్‌ఆఫ్32 పోరులో 42 నిమిషాల పాటు జరిగిన పోరులో 21-17, 21-14 తేడాతో విజయం సాధించింది. అయితే, క్వాలిఫైయింగ్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ అమెరికన్ జోడీ అయిన చెన్ జి యి, ఫ్రాన్సెస్కా కార్చెట్‌ల చేతిలో 16-21, 15-21 తేడాతో ఓడిపోయిన ధ్రువ్ కపిల, రాధిక శర్మల మిక్స్‌డ్ డబుల్స్ జోడీకి మాత్రం టోర్నమెంట్ ముగిసింది. రౌండ్‌ఆఫ్32లో తమ ప్రత్యర్థులైన మలేషియాకు చెందిన ఆరోన్ చియా, సోవూయి యిక్‌లు మ్యాచ్ ప్రారంభమైన కేవలం ఆరు నిమిషాలకే గాయంతో వైదొలగడంతో, హరిహరన్ అమ్సకరుణన్, ఎంఆర్ అర్జున్‌ల పురుషుల డబుల్స్ జోడీ తదుపరి రౌండ్‌కు చేరుకుంది. తొలి గేమ్‌లో మలేషియా జంట వైదొలగినప్పుడు భారతీయులు 11-6 ఆధిక్యంలో ఉన్నారు.

భారత్, న్యూజిలాండ్ మధ్య..
మూడో వన్డే వర్షార్పణం

హామిల్టన్: ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన మూడో వన్డే రద్దయ్యింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో హామిల్టన్ వేదికగా మంగళవారం జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే తుడిచిపెట్టుకుపోయింది. ఓవర్లు కుదించి మ్యాచ్ నిర్వహించే ప్రయత్నం చేసినా, వర్షం ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. మధ్యలో కాసేపు ఆగినా టాస్ వేయగానే మళ్లీ మొదలైంది. కనీసం 20 ఓవర్ల మ్యాచ్ అయినా నిర్వహించేందుకు అంపైర్లు ప్రయత్నించినప్పటికీ వర్షం సహకరించలేదు. దాంతో చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఇప్పటికే ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది. మూడో వన్డేలోనూ గెలిచి మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని భారత్ భావించింది. కానీ ఈ వ్యూహాలను వరణుడు దెబ్బతీసాడు. ఈ రద్దయిన మ్యాచ్‌లో కూడా భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే ఓవర్‌కాస్ట్ కండిషన్స్ భారత్‌కు బాగా కలిసొచ్చేవి. కానీ వర్షం భారత్ విజయవకాశాలను దెబ్బతీసింది. ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే శుక్రవారం (నవంబర్ 13) మౌంట్ మాంగనీయ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌తో పాటు ఆఖరి వన్డేకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ దూరం కానున్నారు. టెస్ట్ సన్నాహకాల కోసం వీరు ప్రాక్టీస్ క్యాంప్‌లో పాల్గొననున్నారు. చివరి రెండు వన్డేల్లో భారత జట్టును శ్రేయస్ అయ్యర్ నడిపించనున్నాడు. గిల్ దూరమైనా, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు, ప్రధాన ఆటగాళ్లంతా జట్టులో ఉండటం కలిసొచ్చే అంశం. ఈ నలుగురు దూరమైనా భారత్‌కు వచ్చే నష్టం ఏంలేదు.





ఫైనల్స్‌కు సబలెంకా, ఆండ్రీవా

ఇండియన్ వెల్స్: టాప్ సీడ్ అరీనా సబలెంకా, రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా తమ డబ్ల్యూటిఎ ఫైనల్స్‌కు చేరుకున్నారు. మంగళవారం ఒక గంట 53 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో సబలెంకా తన ప్రత్యర్థి కరోలినా ముచోవాను 7-6(2), 7-5 తేడాతో ఓడించగా, 19 ఏళ్ల ఆండ్రీవా 70 నిమిషాల్లో ఎలినా స్విటోలినాపై 6-4, 6-0 తేడాతో ఆధిపత్య విజయంతో తన టోర్నమెంట్ అరంగేట్రాన్ని ఘనంగా చాటుకుంది. సబలెంకాపై కెరీర్‌లో 3-2 ఆధిక్యంతో మ్యాచ్‌లోకి ప్రవేశించిన ముచోవా, తొలి సెట్ అంతటా టాప్ సీడ్‌కు గట్టి పోటీ ఇచ్చింది. చెక్ క్రీడాకారిణి రెండుసార్లు బ్రేక్‌లతో ఆధిక్యంలోకి వెళ్లగా, సబలెంకా ఆ రెండు సందర్భాల్లోనూ ప్రతిస్పందించి, టైబ్రేక్‌పై పట్టు సాధించి, దానిని 7-2 తేడాతో గెలుచుకుంది. రెండవ సెట్‌లో కూడా పలుమార్లు సర్వ్ బ్రేక్‌లు చోటుచేసుకున్నాయి. సబలెంకా 5-3 ఆధిక్యం సాధించినప్పటికీ, 5-4 వద్ద మ్యాచ్‌ను ముగించే తొలి అవకాశాన్ని కోల్పోవడంతో, ముచోవా స్కోరును సమం చేసింది. బెలారసియన్ క్రీడాకారిణి వెంటనే తేరుకుని, మళ్లీ సర్వ్‌ను బ్రేక్ చేసి, తన సర్వ్‌ను నిలబెట్టుకుని విజయాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు, ఆండ్రీవా స్విటోలినాపై అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆమె ఎదుర్కొన్న ఆరు బ్రేక్ పాయింట్లనూ కాపాడుకుని, మ్యాచ్ చివరి ఏడు గేమ్‌లను గెలుచుకుంది. ఈ యువ క్రీడాకారిణి చివరి గేమ్‌లో ఎదురైన నాలుగు బ్రేక్ అవకాశాలను కూడా సమర్థవంతంగా ఎదుర్కొంది. ఈ ఫలితం ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్విటోలినా చేతిలో ఎదురైన ఓటమికి ఆండ్రీవా ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ఈ ఇద్దరు ఆటగాళ్లు తమ సీజన్‌ను విజయాలతో ప్రారంభించడంతో, వారి తదుపరి పోరు గ్రూప్ 2 పాయింట్ల పట్టికను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించనుంది.

వరల్డ్ ఛాంపియన్‌షిప్: మహిళల పిస్టల్ టీమ్‌కు స్వర్ణం

పురుషుల రైఫిల్ టీమ్‌కు కాంస్యం



దోహా: దోహాలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026లో ఈషా సింగ్, మను భాకర్, దివ్య తడిగోల్ సుబ్బరాజు మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకుని ఈ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి రెండవ స్వర్ణాన్ని అందించారు. భారత త్రయం 1761-68న సంయుక్త స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, రజత పతకాన్ని గెలుచుకున్న రిపబ్లిక్ ఆఫ్ కొరియా (1748-6న), కాంస్య పతకాన్ని గెలుచుకున్న వియత్నాం (1745-54న) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారత్ తరపున ఈషా 590-25న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఆమె తర్వాతి స్థానాల్లో మను 587-24న, దివ్య 584-19 స్కోరు సాధించారు. ఈషా, మనులు కూడా వ్యక్తిగత ఫైనల్‌కు అర్హత సాధించగా, అందులో మను 27 హిట్‌లతో పోడియంకు కొద్ది దూరంలో నాలుగో స్థానంలో నిలవగా, ఈషా 11 హిట్‌లతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఇదే రోజు అంతకుముందు, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షియోరాన్, నిరజ్ కుమార్‌లతో కూడిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ జట్టు 1751-91న సంయుక్త స్కోరుతో కాంస్యం కైవసం చేసుకుంది. చెకియా 1754-92న స్కోరుతో స్వర్ణం గెలుచుకోగా, నార్వే 1752-81న స్కోరుతో రజతం కైవసం చేసుకుంది. ఐశ్వర్య 587-33న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో నిరజ్ (582-31న) మరియు అఖిల్ (582-27న) నిలిచారు.

నెలరోజుల్లో రూ.147.36 లక్షలకోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్‌లో ఎన్విడియా ప్రకంపనలు



న్యూయార్క్, నవంబరు 10: ప్రపంచంలోనే అతిపెద్ద చిప్ తయారీ సంస్థల్లో ఒకటైన ఎన్విడియాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నెల రోజులకు పైగా కాలంలో కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 1.57 లక్షల కోట్ల డాలర్లు అంటే సుమారు రూ.147.36 లక్షల కోట్లు ఆవిరైంది. ఈ మొత్తం భారత్ జీడీపీ లో మూడో వంతుతో సమానం. చైనా గూఢచర్య ఆరోపణలు, కంపెనీ సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ నెలకొన్న వివాదాలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెట్టుబడుల భవిష్యత్తుపై ఆందోళనలు ఎన్విడియా షేర్లపై ప్రభావం చూపుతున్నాయి. అక్టోబర్‌లో 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో ఎన్విడియా మార్కెట్ విలువ 5.88 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. నవంబర్ 9 నాటికి అది 4.31 లక్షల కోట్ల డాలర్లకు పడిపోయింది. దీంతో కంపెనీ విలువలో 1.57 లక్షల కోట్ల డాలర్ల మేర కోత పడింది. ఈ నష్టం టెస్లా మొత్తం మార్కెట్ విలువైన 1.49 లక్షల కోట్ల డాలర్లను కూడా మించిపోయింది. ముందురోజుఎన్విడియా షేరు 178.67 డాలర్ల వద్ద ముగిసింది. 52 వారాల గరిష్ఠ ధర 243.37 డాలర్లతో పోలిస్తే 26 శాతానికి పైగా తగ్గింది. గత వారంలో 14 శాతం, గత నెలలో 22 శాతం క్షీణించింది. ఏఐ రంగంలో పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగుతాయా అన్న సందేహాలు, నియంత్రణపరమైన అనిశ్చితి కూడా షేర్ల పతనానికి కారణమవుతున్నాయి. మరోవైపు సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ గూఢచర్య ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ సంస్థ మెగాస్పీడ్‌లో గతంలో పనిచేసిన ఆలిస్ హువాంగ్‌తో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్లు జెన్సన్ ఉద్యోగుల వద్ద అంగీకరించిన విషయం తెలిసిందే. చైనా నిఘా సంస్థ తరఫున పనిచేస్తున్నారనే అనుమానాలు ఆమెపై ఉన్నట్లు అమెరికా నిఘా వర్గాల రహస్య నివేదికలో పేర్కొన్నట్లు నమాచారం. ఈనెల 17న వెలువడనున్న త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. 2027 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎన్విడియా 96.2 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఇందులో డేటా సెంటర్ విభాగం వాటా 89 బిలియన్ డాలర్లు. మొత్తం ఆదాయంలో 92 శాతానికి పైగా ఈ విభాగం నుంచే వచ్చింది. మూడో త్రైమాసికంలో 108 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని కంపెనీ అంచనా వేసింది. ఏఐ చిప్‌లకు డిమాండ్ ఎంత బలంగా ఉందో తాజా ఫలితాలు స్పష్టం చేయనున్నాయి. షేరు ధర తగ్గినప్పటికీ వాల్‌స్ట్రీట్ విశ్లేషకులు మాత్రం ఆశాజనకంగానే ఉన్నారు. వచ్చే 12 నెలల్లో షేరు సగటు ధర 327.14 డాలర్లకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

దేశంలో 2.62 లక్షలకు పైగా స్టార్టప్‌లు.. 25 లక్షల మందికి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, నవంబరు 10: దేశంలో పారిశ్రామిక రంగం రోజురోజుకూ విస్తరిస్తోందని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2.62 లక్షలకు పైగా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఏర్పాటై యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని కేంద్రంప్రకటించింది. ఇప్పటివరకు 55,200కు పైగా స్టార్టప్‌లకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. 2016లో స్టార్టప్ ఇండియా కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఒకే ఆర్థిక సంవత్సరంలో ఇన్ని స్టార్టప్‌లకు గుర్తింపు లభించడం ఇదే అత్యధికం. ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదుగుతుండటం దేశంలో పెరుగుతున్న పారిశ్రామిక స్ఫూర్తికి నిదర్శనమని కేంద్రం వెల్లడించింది. 2026 అక్టోబర్ వరకు స్టార్టప్‌ల ద్వారా 25 లక్షలకు పైగా ఉద్యోగాలు సృష్టిజరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025-26లో గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్య 51.6 శాతం పెరిగింది. ఇదే సమయంలో ప్రత్యక్షంగా కల్పించిన ఉద్యోగాల సంఖ్య 36.1 శాతం వృద్ధి చెందింది. 2026 మార్చి నాటికి 1.07 లక్షలకు పైగా గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో కనీసం ఒక మహిళ డైరెక్టర్‌గా లేదా భాగస్వామిగా ఉన్నారు. ఇది మొత్తం గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో సుమారు 48 శాతంగా ఉంది. స్టార్టప్ ఇండియా, స్టార్టప్‌ల కోసం ఫండ్ ఆఫ్ ఫండ్స్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్, స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం వంటి పథకాల ద్వారా ప్రభుత్వం నూతన ఆవిష్కరణలు, ఆర్థిక సహాయం, మార్గదర్శకత్వం, వ్యాపార సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తోంది. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్2, టైర్3 నగరాల నుంచి ప్రారంభమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ పారిశ్రామిక కార్యకలా పాలు విస్తరిస్తున్నాయి. దేశంలో సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి జరుగుతోందనడానికి ఇది నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. దేశ జనాభాలో దాదాపు 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే కావడం ఈ అభివృద్ధికి మరింత ప్రాధాన్యతను ఇస్తోంది. యువతలోని సామర్థ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం పారిశ్రామిక రంగంతో పాటు వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోంది. 2026 మార్చి 31 నాటికి గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్య, ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనలో మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ,గుజరాత్ రాష్ట్రాలుముందంజలో ఉన్నాయి.

భారత్‌లో నిరుద్యోగ రేటు 5.1 శాతానికి తగ్గుదల

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు
మహిళల ఉద్యోగ భాగస్వామ్యంలోనూ వృద్ధి

న్యూఢిల్లీ,నవంబరు 10: దేశంలో నిరుద్యోగ రేటు సెప్టెంబర్ త్రైమాసికంలో 5.1 శాతానికి తగ్గింది. అంతకుముందు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఇది 5.4 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పరిస్థితులు మెరుగుపడటమే ఈ తగ్గుదలకు ప్రధాన కారణమని కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన డేటా స్పష్టం చేస్తోంది. మంత్రిత్వశాఖ మోస్పి విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే చూస్తే 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో గ్రామీణ నిరుద్యోగ రేటు గత త్రైమాసికంలోని 4.8శాతం నుంచి 4.3 శాతానికి పడిపోయింది. పట్టణ ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ నిరుద్యోగ రేటు 6.7 శాతం నుంచి స్వల్పంగా పెరిగి 6.8 శాతానికి చేరింది. ప్రస్తుత త్రైమాసికంలో 15 ఏళ్ల పైబడిన వారిలో మొత్తం నిరుద్యోగ రేటు 5.1 శాతంగా నమోదైందని, గత త్రైమాసికంలో ఇది 5.4 శాతంగా ఉందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉపాధి పొందుతున్నవారితో పాటు ఉద్యోగాల కోసం చురుకుగా ప్రయత్నిస్తున్న వారి సంఖ్య కూడా పెరిగినట్లు సర్వే గణాంకాలు సూచిస్తున్నాయి. 15 ఏళ్ల పైబడిన వారిలో లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోని 54.6 శాతం నుంచి జూలై-సెప్టెంబర్‌లో 55.5 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 56.9 శాతం నుంచి 58.1 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 50.2 శాతం నుంచి 50.4 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఇక వర్కర్ పాపులేషన్ రేషియో కూడా 51.7 శాతం నుంచి 52.7 శాతానికి మెరుగుపడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 54.2 శాతం నుంచి 55.6 శాతానికి పెరిగింది. మహిళల కార్మిక భాగస్వామ్యం రేట్ గత త్రైమాసికంలోని 33.2 శాతం నుంచి 34.7 శాతానికి పెరిగింది. ఉద్యోగాల్లో ఉన్న మహిళల వాటాను సూచించే ఫిమేల్ వర్కర్ పాపులేషన్ రేషియో 31.3 శాతం నుంచి 32.8శాతానికి చేరింది. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న గ్రామీణ కార్మికుల వాటా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోని 52.9 శాతంనుంచి జూలై-సెప్టెంబర్‌లో 56.7 శాతానికి పెరిగినట్లు మోస్పి వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పొందు తున్న వారి వాటా 61.4శాతం నుంచి 62.7 శాతానికి పెరిగింది. పట్టణప్రాంతాల్లో క్రమబద్ధమైన జీత భత్యాల ఉద్యోగాల వాటా స్వల్పంగా మెరుగుపడింది. 2026 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో దేశవ్యాప్తంగా 15ఏళ్ల పైబడిన ఉద్యోగుల సగటు సంఖ్య 57.9కోట్లుగాఅంచనా వేసినట్లు సర్వే వెల్లడించింది.వీరిలో 40.5 కోట్ల మంది పురుషులుకాగా,17.4కోట్లమంది మహిళలు ఉన్నారు.

కళ్యాణ్ జ్యుయెలర్స్ లాభాల్లో 63.9 శాతం వృద్ధి



సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.427 కోట్ల నికర లాభం

ముంబయి, నవంబరు 10: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ కళ్యాణ్ జ్యుయెలర్స్ సెప్టెంబర్ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం 63.9 శాతం పెరిగి రూ.427 కోట్లకు చేరింది. ఈ వృద్ధిలో రూ.73.5 కోట్ల ఒకేసారి లభించిన ఆదాయం కూడా కీలక పాత్ర పోషించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.261 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇక కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 31.4 శాతం వృద్ధితో రూ.10,323 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.7,856 కోట్లుగా నమోదైంది. కంపెనీ వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు ఆదాయం ఎబిడిటా కూడా 29.7 శాతం పెరిగి రూ.644 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.497 కోట్లుగా ఉంది. కంపెనీ నిర్వహణ లాభ మార్జిన్‌లో స్వల్ప తగ్గుదల కనిపించింది. గత ఏడాది సెప్టెంబర్ త్రైమాసికంలో 6.3 శాతంగా ఉన్న ఆపరేటింగ్ మార్జిన్ ప్రస్తుత త్రైమాసికంలో 6.2 శాతానికి తగ్గింది. అంటే ఆదాయ వృద్ధితో పోలిస్తే ఎబిడిటా వృద్ధి కొంత తక్కువగా నమోదైంది. నికర లాభంలో నమోదైన భారీ వృద్ధికి రూ.73.5 కోట్ల ఒకేసారి లభించిన ఆదాయం కూడా తోడ్పడింది. అందువల్ల కంపెనీ సాధారణ వ్యాపార కార్యకలాపాల ద్వారా వచ్చిన లాభాలను, ఈ ప్రత్యేక ఆదాయాన్ని వేర్వేరుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. భారతదేశంలోని ప్రముఖ ఆర్గనైజ్డ్ జువెలరీ రిటైలర్లలో ఒకటైన కళ్యాణ్ జ్యుయెలర్స్ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో కళ్యాణ్, క్యాండియర్ బ్రాండ్ల ద్వారా తన వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కళ్యాణ్ జ్యుయెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ, "ప్రస్తుత పండుగల త్రైమాసికం చాలా ఆశాజనకంగా ప్రారంభమైంది. ముఖ్యంగా నవరాత్రి, ధన్‌త్రయోదశి సందర్భంగా మార్కెట్లో కనిపించిన వృద్ధి మాకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తోంది. రాబోయే వివాహాల సీజన్‌పై కూడా మేము ఆశాజనకంగా ఉన్నాం. ఈ త్రైమాసికాన్ని బలమైన ఫలితాలతో ముగించాలని ఆశిస్తున్నామని తెలిపారు. దేశంలో ఆర్గనైజ్డ్ జువెలరీ రిటైల్ రంగం నిరంతరం విస్తరిస్తున్న నేపథ్యంలో కళ్యాణ్ జ్యుయెలర్స్ ఫలితాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మార్కెట్లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రముఖ ఆభరణాల సంస్థలు కొత్త షోరూమ్‌ల ఏర్పాటు, రిటైల్ నెట్‌వర్క్ విస్తరణపై దృష్టి సారిస్తున్నాయి. పెట్టుబడిదారులు సాధారణంగా కంపెనీల పునరావృతమయ్యే వ్యాపార లాభాలను, ఒకేసారి లభించే ప్రత్యేక ఆదాయాలను వేర్వేరుగా విశ్లేషిస్తారు. కళ్యాణ్ జువెలర్స్ సాధారణ వ్యాపార కార్యకలాపాల్లోనూ మంచి వృద్ధిని నమోదు చేయడం సానుకూల పరిణామమే. ఒకేసారి వచ్చిన రూ.73.5 కోట్ల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, నికర లాభంలో నమోదైన 63.9 శాతం వృద్ధి కంపెనీ సాధారణ ఆదాయ వృద్ధిని కొంత ఎక్కువగా చూపుతుంది.

ఐపిఒకు ఎనిమిది కంపెనీలు

ముంబయి, నవంబరు 10: ఇటీవలి కాలంలో ప్రతి వారం అరడజను ఐఒ ఓలు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉండగా ఇప్పుడు వరుసగా ఐపీఒలు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. డిఫెన్స్,ఫిన్‌టెక్, జువెల్లరీ ఇలా వేర్వేరు రంగాలకు చెందిన సుమారు 8 కంపెనీల ఐపీఒలకు సెక్యూ రిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ ఆమోదం తెలిపింది. ఇందులో ప్రభుత్వ రంగానికి చెందిన కోల్ ఇండియా అనుబంధ సంస్థ మహానంది కోల్‌ఫీల్డ్స్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ వెరిటాస్ ఫైనాన్స్, డిఫెన్స్ టెక్నాలజీ కంపెనీ సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్, ఫిన్‌టెక్ సంస్థ రేజర్ పే సహా మేక్‌మైట్రిప్స్ ఇండియా సబ్సిడరీ కూడా ఉన్నాయి. మిగతా కంపెనీలు చూస్తే ఎన్‌క్యూబ్ ఎథికల్స్, అర్జున్ జువెల్లర్స్, ఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటివి ఉన్నాయి. మహానంది కోల్‌ఫీల్డ్స్ ఐపీఒ పూర్తిగా ఆఫర్‌ఫర్ సేల్ విధానంలోనే ఉండనుంది. ఇక్కడ మొత్తం 66,18,36,300 షేర్లను ప్రమోటర్ కోల్ ఇండియా విక్రయించనుంది. రూ.10వేల కోట్ల వరకు నిధుల్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది.

నవంబరులో 9 రోజుల్లోనే రూ.53,739 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ, నవంబరు 10: వరుసగా రెండు నెలల పాటు భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి పెట్టుబడులను విత్‌డ్రాచేసిన విదేశీ పెట్టుబడిదారులు నవంబర్‌లో తిరిగి కొనుగోళ్ల బాట పట్టారు. నవంబర్ తొలి తొమ్మిది రోజుల్లోనే భారత స్టాక్ మార్కెట్ల లో రూ.53,739 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి సంబంధించిన షేర్లలో అమ్మకాల ఒత్తిడి, దేశీయ కంపెనీల మెరుగైన ఆదాయ వృద్ధి, ఆకర్షణీయమైన లార్జ్ క్యాప్ షేర్ల విలువలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. డిపాజిటరీ గణాంకాల ప్రకారం నవంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు కేవలం ఆరు ట్రేడింగ్ సెషన్లలోనే ఎఫ్‌పీఐలు భారత ఈక్విటీల్లో రూ.53,739 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. అయినప్పటికీ 2026లో ఇప్పటివరకు భారత ఈక్విటీ మ